ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 6 జూన్ 2025



తుడా.. అక్రమాల్లో బడా!



ప్రాథమిక విచారణ పూర్తి

రెండు రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక అందించనున్న విజిలెన్స్

బాధ్యులందరికీ నోటీసులు జారీ

తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

వైసీపీ హయాంలో తుడాలో నిధుల దుర్వినియోగం భారీగా జరిగిందా? అయినవారికి పప్పుబెల్లాల్లా పంచేశారా? దీని ఫలితమే నిధులన్నీ ఊడ్చేయడమా? ఈ ప్రశ్నలన్నింటికీ విజిలెన్స్ విచారణలో ఔననే సమాధానాలు వచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. 12 అంశాలపై ప్రాథమిక విచారణ పూర్తి చేశారు. భారీగా నిధుల దుర్వినియోగం జరిగినట్లు గుర్తించారని తెలిసింది. ఈ మేరకు 'లెక్క'లతో నివేదిక సిద్ధంచేశారని, రెండు రోజుల్లో ప్రభుత్వానికి అందించనున్నారని తెలిసింది.

● తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు కూర్చోవడానికి పది వేల బెంచీలు ఏర్పాటు చేశారు. ఒక్కో బెంచీని రూ.8 వేల చొప్పున కొనుగోలు చేసినట్లు బిల్లులు పెట్టారు. అయితే, మార్కెట్లో దీని విలువ గరిష్ఠంగా రూ.3 వేల నుంచి రూ.3500 వరకు ఉంటుందని విజిలెన్సు అధికారులు గుర్తించారు. ఇలా దాదాపు రూ 4.50 కోట్లు దుర్వినియోగమైనట్లు విచారణలో బయటకు వచ్చింది.

● తుడాలో వివిధ రకాల క్యాడర్లలో 30 మందిని నియమించుకున్నారు. వీరికి ఒక్కొక్కరికీ రూ.20 వేల నుంచి రూ30 వేల వరకు గౌరవ వేతనం చెల్లించారు. ఇలా ఐదేళ్లలో దాదాపు రూ.5 కోట్లు జీతాల రూపంలో చెల్లించినట్లు తెలిసింది. ఇందులోనూ నిధులు పక్కదారి పట్టినట్లు తెలిసింది.

● తుమ్మలగుంట చెరువు అభివృద్ధికని దాదాపు రూ.60 కోట్లు మంజూరు చేశారు. అందులోనూ భారీ ఎత్తున నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించారని సమాచారం.

● ఎన్నికలకు ముందు చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని ఆరుగురు ఎంపీడీవోలకు అభివృద్ధి పనులకని నిధులు మంజూరు చేశారు. తిరుపతి రూరల్ ఎంపీడీవోకు రూ.100 కోట్లు, చంద్రగిరి, రామచంద్రాపురం, చిన్నగొట్టిగల్లు మండలాలకు రూ.35 కోట్లు చొప్పున.. ఎర్రావారిపాలెం, పాకాల మండలాలకు రూ.30 కోట్లు వంతున విడుదల చేశారు. ఈ నిధులు ఎంపీడీవోల ఖాతాల్లో డిపాజిట్ చేయడం చట్ట విరుద్ధమని విజిలెన్సు తేల్చింది. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం నుంచి క్లారిఫికేషన్ తీసుకున్నట్లు తెలిసింది.

> తుడాకు ప్రభుత్వం కేటాయించిన వాహనాలు కాకుండా అదనంగా ఆరేడు వాహనాలను అద్దెకు తీసుకున్నట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది. ఇందుకు గాను నెలకు రూ.4 లక్షలు వెచ్చించినట్లు లెక్కలు చూపారు. ఇలా దాదాపు రూ 1.82 కోట్లు దుర్వినియోగం చేసినట్లు విమర్శలున్నాయి.

● ఇంటింటికీ రెండు పండ్ల మొక్కలు, రెండు సాధారణ మొక్కలు పంపిణీ చేశారు. కొన్ని చోట్ల మొక్కలు పంపిణీ చేయకనే సొంతంగా ఇళ్ల ముందు నాటుకున్న మొక్కలనూ చూపించి తుడా నిధులు స్వాహా చేశారని విచారణలో తేలినట్లు సమాచారం.

● అప్పట్లో తుడాకు సంబంధించి రూ.కోట్ల పనుల టెండర్లను ఒక కంపెనీకి కట్టబెట్టడం వెనుక పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా భారీ స్థాయిలో నాలుగు పనులకు గాను రూ.40 కోట్లు విడుదల చేశారు. దీనిపైనా విజిలెన్సు అధికారులు లోతుగా విచారించారని తెలిసింది. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు రూ.300 కోట్లకుపైగా నిధులు దుర్వినియోగమైనట్లు విచారణలో తేలిందని విశ్వసనీయ సమాచారం. ఇవన్నీ పూర్తయిన తర్వాత క్షేత్ర స్థాయి పర్యటనకు అధికారులు సిద్ధం అవుతున్నారు.

మరికొన్ని గంటల్లో కుమార్తె పెళ్లి

● అంతలోనే ఆగిన తండ్రి గుండె ● ఏఎస్ఐ ఇంట తీవ్ర విషాదం



శ్రీకాళహస్తి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మాట, వినికిడిలేని ఆడబిడ్డను అల్లారుముద్దుగా చూసుకున్నారు. ఆమె వివాహం చేసి తన బాధ్యతను నెరవేర్చుకోవాలని కలలు కన్నారు. ఆ కల్యాణ ఘడియ రానే వచ్చింది. మరికొన్ని గంటల్లో ఇంటి నుంచి తన కుమార్తెను వివాహ మండపానికి తీసుకెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో ఆ తండ్రి గుండె ఆగింది. పెళ్లి సందడితో కళకళలాడిన ఆ ఇల్లు శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ విషాద ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.కేవీబీపురం మండలం కోవనూరుకు చెందిన సాంబయ్య తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్నారు. ఈయన భార్య గృహిణి. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తెకు చిన్నపటి నుంచి మాట, వినికిడిలోపం ఉంది. ఇటీవల రాజీవ్ నగర్‌కు చెందిన ఓ యువకుడితో ఆమెకు వివాహం నిశ్చయించారు. కూతురిపెళ్లికోసం కొద్ది రోజులుగా ఏఎస్ఐ సాంబయ్య విధులకు సెలవు పపెట్టారు. శ్రీకాళహస్తి మండలం రామాపురం రిజర్వాయర్ వద్ద కైలాసగిరిప్రదక్షిణ సాగే మార్గంలోని శివపార్వతుల విడిది మండపంలో గురువారం రాత్రి పెళ్లి జరగాల్సి ఉంది. ఇందుకోసం బంధువులు ఉదయం నుంచే మండపం వద్ద అవసరమైన పనులు చేపట్టారు. పెళ్లి సామగ్రి కొనుగోలు కోసం సాంబయ్య గురువారం సాయంత్రం శ్రీకాళహస్తి పట్టణానికి వచ్చారు. ఆటోలో సామాన్లను వేసుకుని, వెనుక ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని బంగారమ్మ కాలనీ వద్ద ద్విచక్ర వాహనంపై వెళుతూ స్పీడ్‌బ్రేకర్ వద్ద వాహనాన్ని స్లో చేశారు. అక్కడే ద్విచక్రవాహనంపై నుంచి ఒక వైపు ఒరిగిపోయారు. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు ధ్రువీకరించారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాసేపట్లో జరగబోయే కూతురి పెళ్లి ఆనందంలో ఉన్న ఆ తండ్రి.. ఇలా తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో బంధువులు గుండెలు బాదుకుంటూ విలపించారు.

డ్రగ్స్ కేసులో రిజర్వు హెడ్ కానిస్టేబుల్ విధుల నుంచి తొలగింపు

● ఉద్యోగుల చిట్టా బయటకు తీస్తున్న అధికారులు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో డ్రగ్స్ కేసులో అరెస్టయిన తిరుపతి రిజర్వు హెడ్ కానిస్టేబుల్ పూజారి రామచంద్రను విధుల నుంచి తొలగిస్తూ ఎస్పీ హర్షవర్ధనరాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇతను కొంత కాలంగా మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్నవారితో చేతులు కలిపి పెద్ద ఎత్తున అక్రమ సంపాదన చేసినట్లు సమాచారం. రెండేళ్లుగా సాగుతున్న ఈ వ్యవహారంపై ఆ శాఖ రిజర్వు విభాగం అధికారులు దృష్టి సారించలేదు. ఇప్పటికే డ్రగ్స్ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న రిజర్వు కానిస్టేబుల్ గుణశేఖర్‌ను విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఇదే కేసులో గతంలో అరెస్టయిన సురేంద్రరెడ్డికి, కేవీపల్లెకు చెందిన ఈశ్వర రెడ్డి అత్యంత సన్నిహితుడిగా పేరుంది. ఇతడినీ హైదరాబాదులో అరెస్టు చేశారు. ఈ కేసులో ఇద్దరు రిజర్వు పోలీసులతో పాటు మరో ఇద్దరు జిల్లాకు చెందిన వారు అరెస్టు కావడం గమనార్హం. చాపకింద నీరులా సాగుతున్న డ్రగ్స్ వ్యాపారంలో ఇద్దరు రిజర్వు పోలీసులు ఉండటం పోలీసు శాఖలో కలకలం రేపింది. ఇంకా ఈ విభాగంలో ఎవరికైనా గుణశేఖర్‌తో సంబంధాలు వున్నాయా అనే కోణంలో అధికారులు విచారిస్తున్నారు. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు రిజర్వు విభాగంలో పని చేస్తున్న మరో కానిస్టేబుల్‌తో పాటు డీపీఓలో పనిచేస్తున్న సిబ్బంది ఒకరికి రామచంద్రతో సత్సంబంధాలు వున్నట్లు తెలిసింది. అలాగే, ఆ విభాగంలో పనిచేస్తున్న అన్ని స్థాయిల అధికారులు, కింది స్థాయి సిబ్బంది చరిత్ర బయటకు తీసే పనిలో పడ్డారు. గతంలో ఎవరెవరు.. ఎక్కడ.. ఎన్ని సంవత్సరాలు పని చేశారు? అక్కడ వారికి నేర చరిత్ర ఏమైనా వుందా? పనితీరు ఎలా వుంది? నేతలతో ఎవరికి సంబంధాలు ఉన్నాయనే దిశగా ఆరా తీస్తున్నారు.

తిరుపతి రిజర్వు డీఎస్పీ రవీంద్రారెడ్డి బదిలీ

● పర్యవేక్షణ లోపమే కారణమా?



తిరుపతి(నేరవిభాగం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లా రిజర్వు విభాగంలో దీర్ఘకాలంగా ఉన్న డీఎస్పీ రవీంద్రారెడ్డి బదిలీ అయ్యారు. హైదరాబాదు డ్రగ్స్ కేసులో అరెస్టయిన వారిలో తిరుపతి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రామచంద్ర, కానిస్టేబుల్ గుణశేఖర్ ఉన్నారు. మత్తు పదార్థాలు సరఫరాచేసే స్థాయికి వీరు వెళ్లినా ముందుగా పసికట్టి అరికట్టే పరిస్థితి లేకపోవడంతో జిల్లా రిజర్వు విభాగానికి మాయని మచ్చగా తయారైంది. డ్రగ్స్ మూలాలు తిరుపతి జిల్లా రిజర్వు విభాగంలో వున్నప్పటికీ పట్టించుకోక పోవడంతో డీఎస్పీ రవీంద్రారెడ్డిని బాధ్యుడిని చేసి బదిలీ చేసినట్లు సమాచారం.



మొక్క నాటుతున్న డీన్ వీరబ్రహ్మయ్య, ఏడీ జగపతిరామయ్య తదితరులు

అమ్మకోసం ఒకచెట్టు

తిరుపతిరూరల్, జూన్5(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ కళాశాలలో గురువారం 'అమ్మకోసం ఒక చెట్టు' పేరిట విద్యార్థులతో మొక్కలు నాటించారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థుల తల్లులను ఆహ్వానించి.. వారితో కలిసి అమ్మకోసం ఒక చెట్టు పేరుతో (ఏక్ పెడ్ మాకే నామ్, మాకేసాత్, మాకేహాత్) మొక్కలు నాటారు. పిల్లలతో కలసి తమ పేరుపై కళాశాలలో మొక్కను నాటడం చాలా సంతోషంగా ఉందని తల్లులు పేర్కొన్నారు.దీన్ని సంరక్షించే బాధ్యతను కూడా చేపట్టాలని వారు ఆకాంక్షించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి మాతృభూమి కోసం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. వెటర్నరీ డీన్ ప్రొఫెసర్ కె.వీరబ్రహ్మయ్య, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ జగపతిరామయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ లేని భవిష్యత్ కోసం కృషి చేయాలని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ క్రాంతి, డాక్టర్ చైతన్య, డాక్టర్ శ్వేత, డాక్టర్ తేజ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర ప్రకటనలకే పరిమితం

కొనుగోళ్లు ప్రారంభించని గుజ్జు పరిశ్రమలు

పాకాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో రైతులు సాగుచేసిన తోతాపురి మామిడికి మద్దతు ధర ప్రకటనలకే పరిమితమైంది.ఈ నెల3వ తేది చిత్తూరు, తిరుపతి కలెక్టర్లు, ఎమ్మెల్యేలు తోతాపురి మామిడికి ధర నిర్ణయించడంతో రైతులు సంతోషపడ్డారు. కోతకూలీలు, రవాణా ఖర్చులైనా దక్కుతాయనుకున్నారు. 5వ తేది నుంచి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని సంబరపడ్డారు. అయితే గురువారం కూడా గుజ్జుపరిశ్రమల కార్యకలాపాలు ప్రారంభం కాలేదు. ఎప్పుడు కొనుగోళ్లు ప్రారంభిస్తారో కూడా తెలియని పరిస్థితి. మరోవైపు ఇటీవల కురిసిన వర్షాలకు తోటల్లో తోతాపురి కాయలు పక్వానికివచ్చి రాలిపోతున్నాయి. కాయలు కోసి మార్కెట్‌కు తరలిస్తున్న రైతులు మండీల్లో, గుజ్జుపరిశ్రమల్లో కొనుగోలు చేయకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచక ఇబ్బంది పడుతున్నారు. మండీ ర్యాంపులవద్ద టన్ను రూ.5వేలకు కొనేందుకు కూడా వ్యాపారులు మొగ్గుచూపడం లేదు.ఎందుకంటే మండీల్లో తోతాపురి అమ్ముడుపోక మగ్గుతున్నాయి.



కొనుగోళ్లు లేక మ్యాంగోనగర్ మండీల్లో మగ్గుతున్న తోతాపురి

మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం



చంద్రగిరి బాలికల ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాధ

చంద్రగిరి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాధ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చంద్రగిరిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె విచ్చేసి మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమాజంలో రోజు రోజుకూ కాలుష్యం విపరీతంగా పెరిగిపోతుందన్నారు. దీంతో మానవ మనుగడే ప్రమాదంలో పడుతుందన్నారు. మొక్కల పెంపకంతోనే కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్, డిప్యూటీ ఎంపీడీవో వెంకటరత్నం, ఎంఈవో భాస్కర్‌బాబు సీఎంవో సురేష్, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని ఎం.కొత్తపల్లెలో టీడీపీ నాయకులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలకృష్ణమూర్తి, దొమ్మలపాటి సతీష్, అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం సందర్శన

తిరుచానూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పరిధిలోని వేమూరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ విస్తరణ కోసం ఈ క్షేత్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం షణ్ముగం, ధనంజయరెడ్డి, రవిచంద్ర, రైతు అయ్యప్పనాయుడు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణాన్ని కాపాడుకుందాం



చిన్నగొట్టిగల్లులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

భాకరాపేట, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మొక్కలతో పర్యావరణాన్ని కాపాడుకోవాలని తహసీల్దారు జనార్దన్ రాజు, ఎంపీడీవో గిడ్డయ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చిన్నగొట్టిగల్లు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలను నాటారు. అన్ని శాఖల అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీ సంపద ఎక్కువగా ఉంటే ఆరోగ్యకర జీవనం కలిగి ఉంటామన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.

మొక్కల పెంపకంతో మానవ మనుగడ



ఎర్రావారిపాళెం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెరబైలు పంచాయతీలో అటవీ అధికారులు మొక్కలు నాటారు. రేంజ్ ఆఫీసర్ వెంకట్రమణ, తహసీల్దార్ పరమేశ్వరస్వామి, అధికారులు, స్థానిక ప్రజాపతినిధులతో కలిసి ప్రభుత్వ భూముల్లో, రోడ్లకు ఇరువైపు లా మొక్కలు నాటారు. ఆయా సచివాలయాల్లో సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది మొక్కలు నాటారు.

పాఠశాలలకు విద్యార్థి మిత్ర కిట్స్ పంపిణీ



హెచ్‌ఎంలకు కిట్స్ పంపిణీ చేస్తున్న ఎంఈవోలు బాబ్జీ, లింగయ్య

పాకాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు గురువారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్ పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రధానోపాధ్యాయుల సమా వేశంలో ఎంఈవోలు బాబ్జీ, లింగయ్యలు కిట్స్ అందజేశారు. అచ్చుపుస్తకాలు, వర్క్ బుక్స్, యూనిఫాం, బెల్ట్, బ్యాగ్, డిక్షనరీ, బూట్లు, నోట్‌బుక్స్‌తో కూడిన కిట్లను అందజేశారు. పాఠశాలలు ప్రారంభమైన రోజే వీటిని విద్యార్థులకు అందజేయాలని సూచించారు. పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి కిట్స్ ఇవ్వాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పాకాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అందరూ బాధ్యతగా పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని జడ్పీటీసీ పద్మజరెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండలంలో మొక్కలు నాటారు. ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణం కలుషితమవుతుందన్నారు. భావితరాల కోసం ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడాలన్నారు. మొక్కలు నాటి సంరక్షించాలని, భూగర్భ జలాలను పెంపొందించేలా కృషిచేయాలన్నారు. కావలివారిపల్లెలో సర్పంచ్ చెంగల్రాయులు, టీడీపీ నాయకురాలు కె.సావిత్రి, అటవీశాఖ, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు మొక్కలు నాటారు.



కావలివారిపల్లెలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ చెంగల్రాయులు



పిల్లలు మునిగిపోయిన చెరువులోని కుంట

ఈత సరదాకు ముగ్గురు పిల్లల బలి

వి.కోట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):సరదాగా ఈతకు వెళ్లిన ముగ్గురు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. వి.కోట మండలం కృష్ణాపురం పంచాయతీ మోట్లపల్లెలో ఈ విషాదం చోటుచేసుకుంది.మోట్లపల్లెకు చెందిన ఆదెప్ప కుమారులు పూర్ణేష్(14), జగన్(11),ఆదెప్ప చెల్లెలు కవిత కుమారుడు నిఖిల్(13), రెడ్డెప్ప కుమారుడు కుశల్(11), గురువారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని చెరువులో ఈత నేర్చుకునేందుకు వెళ్లారు.వీరిలో పూర్ణేష్‌కు మాత్రమే ఈత వచ్చు. మిగిలిన ముగ్గురూ ఈత నేర్చుకుంటున్నారు. చెరువు మధ్యలో వున్న నీటికుంటలో ఈతకోసం దిగిన వారిలో లోతైన ప్రాంతానికి వెళ్లిపోవడంతో ముగ్గురు బయటకు రాలేకపోయారు. ప్రమాదాన్ని పసిగట్టిన పూర్ణేష్ బయటకు వచ్చి తీగల సాయంతో మునిగిపోతున్న వారిని బయటకు లాగేందుకు ప్రయత్నించాడు.అయితే ఆ ప్రయత్నాలు సఫలం కాకపోవడంతో గ్రామానికి చేరుకుని ప్రమాదం గురించి చెప్పాడు.అందరూ కలిసి నీటికుంట వద్దకు చేరుకుని ముగ్గురినీ బయటకు లాగారు. అయితే అప్పటికే ఇద్దరు పిల్లలు మృతి చెందారు.జగన్‌కు కాస్త ఊపిరి ఆడుతోందని గ్రహించి వి.కోట ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్ళారు.అక్కడ పరీక్షించిన వైద్యులు ఆ బాలుడు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు.మృతి చెందిన పిల్లలు కృష్ణాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇద్దరు ఆరవ తరగతి, ఒకరు ఎనిమిదవ తరగతి పూర్తి చేశారు. విద్యార్థుల మృతి విషయం తెలుసుకున్న సీఐ సోమశేఖర రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.ముగ్గురు పిల్లలు ఒకేసారి మృత్యువాత పడడంతో మోట్లపల్లె శోకసంద్రంగా మారింది.మృతి చెందిన పిల్లల వద్ద వారి కుటుంబీకులు, బంధుగణం రోదనలు చూపరులను కలచివేశాయి. ఆదెప్పకు ఇద్దరు కుమారులుండగా ఒకరు, రెడ్డెప్పకు కుమార్తె, కుమారుడు ఉండగా కుమారుడు, కవితకు కుమారుడు, కుమార్తె ఉండగా కొడుకు మృత్యువాత పడ్డారు. ఈ ఘటనపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల వద్దకు పిల్లల్ని పంపినప్పుడు తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



ప్రాణాలు కోల్పోయిన నిఖిల్, కుశల్, జగన్(ఫైల్ ఫొటోలు)



మృతదేహాల వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు



ఘటనా స్థలం వద్ద గుమిగూడిన గ్రామస్థులు

మానవాళికి మొక్కలే జీవనాధారం

తిరుపతిరూరల్, జూన్5(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలోని పలు పంచాయతీల్లో గురు వారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వనం-మనం కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో మొక్కలు నాటారు. పేరూరు గ్రామంలో ఎంపీపీ మూలం చంద్ర మోహన్‌రెడ్డి, ఎంపీడీవో రామ చంద్ర, టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, నాగూరు శ్రీనివాసులు, వేదాంత పురం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చెరు కుల జనార్దన్ యాదవ్, కార్యదర్శి మునీశ్వరి, దుర్గ సవ ు ద్రం సచివాలయంలో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి మునిశేఖర్, కార్యదర్శి నర సింహులు, కూటమి నేతలు మనోగ్ని, దిలీప్, బాబు రాయల్, సుధాకర్, శ్రీనురాయల్, తుమ్మలగుంట శ్మశానవాటిక వద్ద టీడీపీనేత బిరుదాల భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, సాయినగర్ పంచాయతీల్లో సర్పంచ్ డీవీ రమణ, ఎంపీడీవో రామచంద్ర, కార్యదర్శి శ్రీలేఖ, ఏపీవో జ్యోతిశ్రీ మొక్కలు నాటి నీరు పోశారు.



దుర్గసముద్రంలో మునిశేఖర్, నరసింహులు తదితరులు

వేదాంతపురంలో రక్తదాన శిబిరం

తిరుపతిరూరల్, జూన్5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చెరుకుల జనార్ధన్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు గ్రామస్తులు రుయా బ్లడ్‌బ్యాంక్‌కి రక్తదానం చేశారు. రుయా సిబ్బంది పాల్గొన్నారు.



వేడుకగా తిరుచ్చి ఉత్సవం

తిరుచానూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): తిరు చానూరులో కొలువై ఉన్న సూర్య నారాయణ స్వామికి గురువారం అత్యంత వేడుకగా తిరువీధి ఉత్సవం జరి గింది. స్వామివారి జన్మనక్షత్రం హస్త పురస్కరిం చుకుని ఆలయంలో అర్చకులు విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. మూలమూర్తికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. సాయంత్రం సర్వఅలంకార శోభితులైన సూర్య నారాయణ స్వామి బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.



పోలీసులపై దాడి

● నలుగురు యువకుల అరెస్టు


తిరుపతి (నేరవిభాగం), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పోలీసులపై దాడి చేసిన ఘటనలో మంగళం బీటీఆర్ పురంలోని నలుగురు యువకులపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. మంగళం పంచాయతీ బీటీఆర్ పురంలో జాతర సందర్భంగా స్థానికంగా ఉన్న కొంతమంది యువకులు మద్యం తాగి రోడ్లపై తిరుగుతుండడంతో విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. అయితే మద్యం మత్తులో ఉన్న మనోహర్(మను), ప్రవీణ్, ప్రేమ్, విన్నీ విద్యుత్తు లైట్లను ఆపుచేసి మరి కానిస్టేబుల్‌పై తీవ్రంగా దాడి చేశారు. ఈ ఘటనపై తిరుచానూరు సీఐ సునీల్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిషేధిత హారన్ల తొలగింపు



తిరుపతి (నేరవిభాగం), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వాహనాలకు ఏర్పాటు చేసిన నిషేధిత హారన్లపై గురువారం తిరుపతిలో ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. లీలామహల్ సర్కిల్ వద్ద తిరుమలకు వెళ్తున్న వాహనాలు ఆపి వాటిని ఆ హారన్లు తొలగించారు. ద్విచక్ర వాహనాలు, జీప్‌లు తనిఖీ చేసి దాదాపు పది వాహనాలకున్న లౌడ్ హారన్లు తీసేశారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేధో గురుదక్షిణా మూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఎంసీఏ రెండవ సెమిస్టర్ ఫలితాల్లో కేఎంఎం విద్యార్థుల ప్రతిభ



చంద్రగిరి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్శిటీ విడుదల చేసిన ఎంసీఏ రెండవ సెమిస్టర్ ఫలితాల్లో కేఎంఎం కళాశాల విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 98 శాతం ఫలితాలను సాధించారని కళాశాల చైర్ పర్సన్ సాకే త్రిపుర ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బి.నివేదిత (8.51), సి.లక్ష్మణ్(8.31), కే.జయలక్ష్మి(8.25), సి.యాస్మిన్(8.25), ఆర్.సాయిగణేష్ (8.24), జే.మమత(8.20), కే.ఉషా రాణి (8.20), టి.సంధ్య(8.12) గ్రేడ్లు సాధించి టాపర్లుగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చైర్ పర్సన్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వెంకటరమణ, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, జూన్5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఉన్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



ఆలయం ముందు కుటుంబసభ్యులతో మాణిక్యరావు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

ఇష్టానుసారంగా పనిచేయాలంటే కుదరదు

● వారంలో ఆరు రోజులు డ్యూటీలు చేయాల్సిందే
● పోలీసు అధికారుల సంఘం నాయకులకు ఎస్పీ హెచ్చరిక

తిరుపతి(నేరవిభాగం), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): 'ఇన్నాళ్ళు ఏం జరిగిందో నాకు వద్దు. ఇకపై యూనియన్ లో ఉన్న నాయకుల నుంచి సభ్యుల వరకు యూనిఫాం వేసుకుని డ్యూటీలు చేయాల్సిందే. ఇష్టానుసారంగా పనిచేయాలంటే మాత్రం కుదరదు' అంటూ ఎస్పీ హర్షవర్ధనరాజు స్పష్టంచేశారు. తిరుపతి ఎస్పీ క్యాంపు కార్యాలయంలో గురువారం పోలీసు అధికారులు సంఘం తిరుపతి జిల్లా యూనియన్ నాయకులతో ఎస్పీ సమావేశం నిర్వహించారు. తిరుపతి రిజర్వు విభాగంలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ రామచంద్ర, కానిస్టేబుల్ గుణశేఖర్ హైదరాబాదులోని డ్రగ్స్ కేసులో అరెస్టయిన విషయం తెలిసిందే. వీరిలో గుణశేఖర్ యూనియన్‌లో ఉన్నప్పటికీ అతని వ్యవహార శైలి, పనితీరు, ఇష్టమొచ్చినట్లు సెలవులు పెట్టడం వంటి వాటిపై మీరు ఎందుకు దృష్టి సారించి విజిలెన్స్‌గా వుండలేకపోయారని ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా నా నోటీసులోకి ఎందుకు తీసుకురాలేదని నిలదీశారు. యూనియన్ నాయకులు ఇష్టమొచ్చినట్లు అనధికారికంగా బయటకు వెళ్ళి సొంత పనులు చక్కబెట్టుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రతి ఒక్కరూ స్టేషన్ డ్యూటీలు చేయాల్సిందేనని తెగేసి చెప్పారు. బంధువులు కానీ, స్నేహితుల వివాహం కానీ చెప్పకుండా, సెలవు పెట్టకుండా ఎలా వెళతావని సంఘం బాధ్యుడ్ని ప్రశ్నించిన ఎస్పీ.. వెంటనే మెమో ఇచ్చి వివరణ తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై ఆయన సారీ చెప్పి భవిష్యత్తులో అలా చేయనని చెప్పడంతో శాంతించారు. అనంతరం ఎస్బీలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ సోమశేఖర్‌రెడ్డిని తిరుపతి క్రైం స్టేషన్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. యూనియన్‌లో ఉన్న ప్రతి ఒక్కరూ యూనిఫాం ధరించి కనపడాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని భవన నిర్మాణ కార్మికుడి మృతి

శ్రీకాళహస్తి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని తిరుకాల సోమయ్య గౌడ్(45) అనే భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. శ్రీకాళహస్తి మండలం నారాయణపురానికి చెందిన సోమయ్య గౌడ్ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తుంటాడు. బుధవారం రాత్రి ఏర్పేడు మండలం మన్నసముద్రంలో నిర్మాణంపూర్తి చేసిన గృహ ప్రవేశ పూజకు వెళ్లాడు. గురువారం వేకువజామున తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలో శ్రీకాళహస్తి మండలం తొండమనాడు వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వెళుతున్న కొందరు వాహనదారులు గుర్తించి శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. రూరల్ పోలీసులు మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం తిరిగి బంధువులకు అప్పగించిన పోలీసులు హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో కార్మికుడి ఆత్మహత్య

శ్రీకాళహస్తి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ధనంజయ(42) అనే కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీకాళహస్తి పట్టణం ముత్తరాశిపాళెంకు చెందిన ధనంజయ ప్రైవేటు కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఇటీవల కుటుంబంలో కలహాలు తలెత్తాయి. దాంతో మనస్థాపం చెందిన ధనంజయ బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. కాసేపటి తరువాత గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

శ్రీసిటీలో ఘనంగా పర్యావరణ దినోత్సవం

వరదయ్యపాళెం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ హిత ప్రమాణాలతో సుస్థిర అభివృద్ధి దిశగా పయనిస్తున్న శ్రీసిటీలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీపొల్యూషన్ కంట్రోల్ బోర్డు తిరుపతి జోనల్ కార్యాలయ సీనియర్ పర్యావరణ ఇంజనీర్ ఎస్ఎస్ మురళి విచ్చేసి స్థానిక ఎలక్ట్రానిక్ మ్యానుఫాక్చరింగ్ క్లస్టర్‌లో మియావాకి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. శ్రీసిటీ చేపట్టిన పర్యావరణ హిత చర్యలను అభినందించారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ రెడ్యూస్, రియూజ్ రీసైకిల్ (3ఆర్) విధానం పర్యావరణ పరిరక్షణకు ఎంతో అనువైందన్నారు. శ్రీసిటీలో సుస్థిరిత, కాలుష్య నివారణ, వ్యర్థ పదార్థాల నిర్వహణకు పై విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు గ్రీన్ అండ్ క్లీన్ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డితో కలిసి మొండలైజ్ పైప్స్ పరిశ్రమల సప్లై చైన్ ప్రెసిడెంట్ వెంకట్ వేనేపల్లి, బెర్లిన్ సోలార్ యూనిట్ హిల్ అండ్ స్మిత్ హోల్డింగ్స్ సీఈవో రట్జర్ ఆల్బర్ట్‌లు 350 కిలోవాట్ల సోలార్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఉద్యానశాఖ విభాగాధికారి మధుసూదన్ రెడ్డి, ఏపీపీసీబీ పర్యావరణ ఇంజనీర్ సుధీర్, శ్రీసిటీ పర్యావరణ ఇంజనీర్ వెంకట్, సత్యవేడు అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సోలార్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రవీంద్ర సన్నారెడ్డి, వెంకట్ వేనేపల్లి, రట్జర్ ఆల్బర్ట్ తదితరులు

ఉద్దండ గణపతి వేద పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రవేశం... భోజన వసతి సౌకర్యాలు ఉచితం : ట్రస్టీ శ్రీనివాసరావు

తిరుపతి(విద్య), జూన్ 5(ఆంధ్రజ్యోతి): మంగళం విద్యానగర్‌లోని ఉద్దండ గణపతి వేద పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అజేయ శంకర ట్రస్టీ వ్యవస్థాపకుడు శ్రీనివాసరావు సూచించారు. 7 సంవత్సరాల పాటు సాగనున్న వేద విద్యాభ్యాసాన్ని పూర్తిగా ఉచితంగా విద్యార్థులకు అందిస్తున్నట్టు వివరించారు. 8 నుంచి 12 సంవత్సరాల వయసు కలిగిన బాలురు అర్హులని, స్వసూత్రం ప్రకారం ఉపనయనం అయి ఉండాలని పేర్కొన్నారు. అలాగే సంధ్యా వందనం, అగ్నికార్యం, బ్రహ్మాయజ్ఞం, స్వవేద శాఖానుసారం ఆచరిస్తూ ఉండాలని, వేద పాఠశాలలో చేరే సమయానికి మరేదేని పాఠశాలలో ప్రవేశం పొంది ఉండరాదని సూచించారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మౌఖిక పరీక్ష ద్వారా ఎంపికలు జరుగుతాయని, ఇతర వివరాలకు 8688256004లో సంప్రదించాలని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ రక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. ప్రపంచ పర్యా వరణ దినోత్సవం సందర్భంగా స్విమ్స్‌లో గురువారం పర్యావరణ రక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణం పూర్తిగా దెబ్బతింటోందన్నారు. మొక్కలు నాటకపోవడం, ఉన్న వాటిని అకారణంగా నరికివేయడం కూడా పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నాయని తెలిపారు. అనంతరం ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. స్విమ్స్ పరిసరాల్లో మొక్కలు నాటారు. ఈఎస్ఐలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్యాంబాబు ఆధ్వర్యంలో ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ ప్రాధాన్యత గురించి వివరించారు. ఎస్వీ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ రవిప్రభు విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. వైద్య విభాగాధిపతులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలో పోలీసుల హల్‌చల్

లోకాయుక్త, ఎన్‌హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు



తిరుపతి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్‌పల్లె పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివా దాస్పద స్థలంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఎమ్మార్ పల్లె పోలీస్ స్టేషన్‌కు చెందిన ఓ ఎస్ఐ యూనిఫాంలో రాగా మరికొందరు సాధారణ దుస్తుల్లో స్థలం వద్దకు చేరుకుని వాహనంతో గేటును ఢీకొట్టే ప్రయత్నం చేశారు. చేతితో తాళం లాగారు. గేటుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా గమనించిన స్థలానికి తామే హక్కుదారులుగా చెప్పుకునే వ్యక్తులు అలార్మ్ మోగించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. తిరుపతి రూరల్ అవిలాల గ్రామ లెక్కదాఖలా సర్వే నెంబరు 145, 147/2లో భూమి వివాదంలో ఉంది. ఇరువర్గాలు హైకోర్టును ఆశ్రయించాయి. సదరు స్థలంపై పోలీసులు జోక్యం చేసుకోవద్దని తాజాగా హైకోర్టు స్టేటస్‌కో ఇచ్చింది. అయితే పోలీసులు అర్ధరాత్రి వేళ వచ్చి గేటు పగులకొట్టే ప్రయత్నం చేసిన ఘటన సీసీ టీవీలో రికార్డైన సన్నివేశాలతో గురువారం లోకాయుక్తతో పాటు, జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎన్‌హెచ్‌ఆర్సీ ఆన్‌లైన్‌లో ఫిర్యాదును స్వీకరించింది.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి(జీవకోన), జూన్ 5(ఆంధ్రజ్యోతి): తన స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పుత్తూరు మండలం శ్రీనివాసపురం ఎంపీపీ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం మావిలయ్య కోరారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కేవీబీపురం మండలం రాయపేడు గ్రామ లెక్కదాఖలా సర్వే నెంబరు 164/15లో 48 సెంట్ల భూమి తనకు వంశపారంపర్యంగా సంక్రమించిందన్నారు. ఎమ్మెల్యే ఆదిమూలం అనుచరులుగా పేరున్న జాన్సన్, శరత్‌కుమార్, చటర్జీ, బసవయ్య, దొరస్వామి, మణి, ఏలుమలై భూమికి సంబంధించిన రికార్డులు తారుమారు చేసి, ఇబ్బందులకు గురిచేస్తున్నార న్నారు. వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా లక్ష్మీపతి

మంగళం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజ్ ఆఫీసర్ ఎస్.లక్ష్మీపతి ఎన్నికయ్యారు. గురువారం విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో సంఘం రాష్ట్ర ఎన్నికలు నిర్వహించారు. జ్యుడీషియల్ విభాగం నుంచి రామచంద్రరావు ఎన్నికల అధికారిగా నిర్వహించిన ఈ ఎన్నికల్లో లక్ష్మీపతి మూడవసారి ఏకగ్రీవంగా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తనను గెలిపించిన ఉద్యోగులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

స్వామికి పీహెచ్‌డీ ప్రదానం



ఎల్ఎల్ఎన్ స్వామి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ సైకాలజీ విభాగ పరిశోధక విద్యార్థి ఎల్ఎల్ఎన్ స్వామికి పీహెచ్‌డీని ప్రదానం చేశారు. డాక్టర్ బీఎస్ కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో అకడమిక్ ప్రొక్రాస్టినేషన్ అమాంగ్ హైస్కూల్ స్టూడెంట్స్: దిరోల్ ఆఫ్ అంగ్జైటీ, సెల్ఫ్ కాన్ఫిడెన్స్ అండ్ ఎమోషనల్ మెచ్యూరిటీ అనే అంశంపై పరిశోధనా వ్యాసం సమర్పించినందుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు సీఓఈ డాక్టర్ బి.రాజమాణిక్యం పేర్కొన్నారు.

తిరుపతి

తుడా లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించండి



తిరుపతి, జూన్5(ఆంధ్రజ్యోతి) : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ఏర్పాటు చేసిన లేఅవుట్లలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని వీసీ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళం సమీపంలో ఏర్పాటు చేసిన శేషాచల హిల్ వ్యూ లే అవుట్‌ను గురువారం అధికారులతో కలసి ఆమె పరిశీలించారు. లేఅవుట్‌లో అనధికారిక నిర్మాణాలు, ఆక్రమణలు జరగకుండా చూడాలన్నారు. ఎస్‌హెచ్ లే అవుట్‌లో పార్కులు ఆక్రమణలకు గురికాకుండా తగు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈ.ఈ రవీంద్ర, ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, సుగుణమ్మ, మౌర్య తదితరులు

తిరుపతి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని, ఇందుకోసం మొక్కలు పెంచాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సీతమ్మ రోడ్డులో ఆయన ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, నగర కమిషనర్ ఎన్.మౌర్య, డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, అర్బన్ డెవలప్‌మెంట్ బోర్డు డైరెక్టర్ ఊకా విజయకుమార్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, కార్పొరేటర్ దూదికుమారితో కలిసి మొక్కలు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతిలో పర్యావరణ పరిరక్షణ కోసం అన్ని చర్యలు చేపడుతున్నామని, ఇందులో భాగంగా ఐదువేల మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టామని అన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో ప్రజల, జంతువుల ఆరోగ్యం దెబ్బతింటోందని, దానికి దూరంగా ఉండాలని కోరారు. సుగుణమ్మ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధానికి సహకరించి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఎన్.మౌర్య మాట్లాడుతూ తిరుపతిని ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా మార్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు, ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, కూటమి నేతలు బీవీ కీర్తి, చినబాబు, మహేష్ యాదవ్, ఆముదాల తులసీరాం, కొట్టే హేమంత్ రాయల్, ఆర్సీ శ్రీనివాస్, ఆర్కాట్ కృష్ణప్రసాద్, రాజా రెడ్డి, శేషు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత తిరుపతికి నడుం బిగిద్దాం

రైతులకు గుడ్డ బ్యాగులు పంపిణీ చేసిన కమిషనర్



రైతుబజార్‌లో గుడ్డ సంచులను పంపిణీ చేస్తున్న కమిషనర్ మౌర్య, డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ

తిరుపతి, జూన్5(ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ రహిత తిరుపతి స్థాపనకు ప్రతి ఒక్కరూ కలసి రావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం స్థానిక రైతు బజారులో ప్రజలకు గుడ్డ బ్యాగులను డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణలతో కలసి ఆమె పంపిణీ చేశారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కూరగాయలు కొనేందుకు వచ్చే వారందరూ గుడ్డ, జూట్ బ్యాగులు వాడేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దూది కుమారి, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మున్సిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించాలి

వేసవి శిక్షణా శిబిరం ముగింపు సభలో వక్తలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

తిరుపతి (అర్బన్), జూన్ 5(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించే దిశగా తల్లిదండ్రులు చొరవ చూపాలని తిరుపతి రూరల్ ఎంఈవో శంకరయ్య, జీఎస్టీ అధికారి హరిప్రసాద్, ప్రముఖ వైద్యులు కిశోర్ కుమార్‌లు పిలుపునిచ్చారు. గురువారం ఉదయం తిరుపతి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పిల్లలకు పుస్తక పఠనం అలవాటు చేయాలని తల్లిదండ్రులను కోరారు. ఏటా ప్రభుత్వ గ్రంథాలయ శాఖ నిర్వహించే ఉచిత వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయాధికారి జే.శివప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ 28 నుంచి జూన్ 5వ తేదీ వరకూ గ్రంథాలయంలో పిల్లలకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించామన్నారు. డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, గ్రామర్, యోగా, వ్యక్తిత్వ వికాసం, జీకే, స్పీడ్ మ్యాథ్స్, క్రాఫ్ట్ వర్క్ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చామన్నారు. ఆయా అంశాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన పిల్లలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధి నడ్డి నారాయణ, ఆర్టిస్టులు అర్చన, గాయత్రి, తహసున్నీసా బేగం, డాక్టర్ గోపాల్, డాక్టర్ సోము ఉమాపతి, గ్రంథాలయ సిబ్బంది గోవిందు, రమణమ్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



సైన్స్ సెంటర్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మురళి

మంగళం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి రీజినల్ సైన్స్ సెంటర్, ఏపీ కాలుష్య నియంత్రణ బోర్డు సంయుక్తంగా రీజనల్ సైన్స్ సెంటర్‌లో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం అనే అంశంపై ఐదు రోజుల పాటు పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తిరుపతి, కర్నూలు జోనల్ ఆఫీస్ నుంచి జాయింట్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ ఎస్ఎస్ మురళి ముఖ్య అతిథిగా వచ్చి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన ప్రపంచ పర్యావరణ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. అంతకు ముందు ఆస్టర్ నారాయణాద్రి అస్పత్రి వారు మొక్కలను పంచిపెట్టారు. సైన్స్ సెంటర్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నారాయణాద్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ మురళి, రీజనల్ సైన్స్‌సెంటర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పురుషోత్తం పాల్గొన్నారు.

తిరుపతి రూరల్ స్టేషన్ తనిఖీ



స్టేషన్ బయట బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ స్టేషన్‌ను ఎస్పీ హర్షవర్ధన రాజు గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రత్యేకంగా 16 అంశాలపై ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డును పరిశీలించి సీఐను అభినందించారు. పెండింగ్ కేసులను వేగవంతంగా విచారణ చేయాలని ఆదేశించారు. స్టేషన్ వద్దకు సమస్యలపై వచ్చిన బాధితులతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. న్యాయం చేయాలని సీఐ చిన్నగోవిందును ఆదేశించారు.

సెల్‌ఫోన్ దొంగల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని ఈస్ట్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన గెద్దల గడ్డ నాగరాజు, సత్యసాయి జిల్లా రామచంద్ర, అసోం రాష్ట్రానికి చెందిన మహేంద్ర నాయక్ కొన్ని రోజులుగా తిరుపతి కేంద్రంగా మొబైల్ ఫోన్లు, విలువైన వస్తువులు దొంగలిస్తున్నారు. రహస్య సమాచారం మేరకు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రామాంజనేయులు కలిసి సాయి మొబైల్ దుకాణం వద్ద కాపు కాచారు. అక్కడ తచ్చాడుతుండగా ఆ ముగ్గురిని అరెస్టు చేశారు. వారి నుంచి మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలోని విద్యుత్ తీగల మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ చంద్రశేఖరరావు తెలిపారు. మెడికల్ కళాశాల, మెటర్నిటీ, బర్డ్, స్విమ్స్ ఆస్పత్రులు, వసతి గృహాలు, సమీప ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించండి

తిరుపతి(ఆటోనగర్), జూన్ 5(ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ పెరుగుతున్న వాహన కాలుష్యాన్ని నివారించడానికి మొక్కలు నాటాలని తిరుపతి ప్రజా రవాణాధికారి వెంకట్రావు కార్మికులకు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో భాగంగా గురువారం అలిపిరి డిపోలో ఆయన మొక్కలు నాటారు. ప్రతి కార్మికుడూ ఒక మొక్కను నాటాలన్నారు. పర్యావరణ పరిరక్షణ దినం ప్రత్యేకతను వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు విశ్వనాథ్, బాలాజీ, డిపో మేనేజరు హరిబాబు పాల్గొన్నారు.

హాకీ జిల్లా బాలికల జట్టు ఎంపిక



తిరుపతి అర్బన్, జూన్5(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల హాకీ క్రీడా మైదానంలో గురువారం 18మంది సభ్యులతో హాకీ జూనియర్ బాలికల జిల్లా జట్టు ఎంపిక చేసినట్లు జిల్లా కార్యదర్శి బి.ఆదిత్య పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా భీమవరంలో ఈనెల 6నుంచి 8వ తేదీ వరకు జరిగే అంతర జిల్లాల ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన వారికి ముఖ్య అతిథులుగా హాజరైన సి.శంకర్‌యాదవ్, రమేష్‌కృష్ణ, కరుణ, భీమా చేతుల మీదుగా జెర్సీ అందించారు.







గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వాహన సేవల ముందు కళా బృందాల ప్రదర్శన ఆకట్టుకుంది. కళాకారుల నృత్యాలను భక్తులు ఆసక్తిగా తిలకించడం కనిపించింది.





9 నుంచి శ్రీవారి ఆలయంలో జ్యేష్టాభిషేకం

తిరుమల, జూన్5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు సాలకట్ల జ్యేష్టాభిషేకం జరగనుంది. శ్రీవారి ఆలయం సంపంగి ప్రదక్షిణ ప్రాకారంలోని కల్యాణమండపంలో నిర్వహించే ఈ క్రతువును 'అభిద్యేయక అభిషేకం' అని కూడా అంటారు. తరతరాలుగా అభిషేకాలతో అత్యంత ప్రాచీనమైన స్వామివారి ఉత్సవమూర్తులు అరిగిపోకుండా పరిరక్షించేందుకు ఈ ఉత్సవాన్ని ఏర్పాటు చేశారు. మొదటిరోజు శ్రీమలయప్ప స్వామికి ఉండే బంగారు కవచాన్ని తొలగించి హోమాలు, అభిషేకాలు, పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఆ తర్వాత స్వామికివారికి వజ్రకవచాన్ని అలంకరించి సాయంత్రం ఊరేగిస్తారు. ఇక రెండవరోజు ముత్యాల కవచం సమర్పిస్తారు. చివరిరోజు తిరుమంజనాదులు పూర్తిచేసి తిరిగి బంగారు కవచాన్ని సమర్పిస్తారు. ఈ బంగారు కవచాన్ని మళ్లీ వచ్చే ఏడాది జ్యేష్టాభిషేకంలోనే తీస్తారు. అంతవరకు ఏడాది పొడవునా శ్రీవారు బంగారు కవచంతోనే వివిధ ఉత్సవాల్లో పాల్గొంటారు.

తిరుమలకు మెరుగైన భద్రత

● టీటీడీ నూతన సీవీఎస్వో మురళీకృష్ణ



తిరుమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గతంలో డీఎస్పీగా, అదనపు ఎస్పీగా పనిచేసిన అనుభవాన్ని ఉపయోగించుకుని భక్తులకు, తిరుమల క్షేత్రానికి మెరుగైన భద్రతను కల్పించేలా విధులు నిర్వహిస్తానని టీటీడీ నూతన సీవీఎస్వోగా కేవీ మురళీకృష్ణ తెలిపారు. తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల టీటీడీ తీసుకున్న నిర్ణయాలను అర్థం చేసుకుని భద్రత పెంపుకోసం చర్యలు తీసుకుంటామన్నారు. టెక్నాలజీని కూడా వినియోగించుకుని ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. ఇంత బాధ్యతాయుతమైన ఉద్యోగాన్ని నిర్వర్తించేందుకు అవకాశం కల్పించిన స్వామివారితో పాటు సీఎం, డిప్యూటీసీఎం, సీఎస్, డీజీపీకి ధన్యవాదాలు తెలిపారు.


శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, జూన్5(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.67 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,288

తలనీలాలు సమర్పించినవారు: 32,079



అమ్మ ముఖంలో ఆనందం



బయటి నుంచి కొనుగోలు చేసిన బేబీ బెడ్స్‌లో పురిటి బిడ్డలను ఆస్పత్రి నుంచి తీసుకువెళుతున్న తల్లులు

పంపిణీకి సిద్ధం చేస్తున్న బేబీ కిట్లు



పసికందుల సంరక్షణకు ప్రభుత్వం శ్రీకారం

ఎన్టీఆర్ బేబీ కిట్ల పునరుద్ధరణకు ఏర్పాట్లు

ఎన్టీఆర్ బేబీ కిట్ల పథకాన్ని పునరుద్ధరించాలనే నిర్ణయం పేదతల్లుల్లో ఆనందాన్ని నింపనుంది. ప్రసవానికి ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేవారిలో ఎక్కువమంది పేదవారే. ప్రసవానంతం రూ.500 ఖర్చు పెట్టి పసికందును తీసుకువెళ్లలేని దైన్యస్థితిని ఎదుర్కొనేవారే. ఈ పరిస్థితిని గుర్తించిన టీడీపీ ప్రభుత్వం గతంలో ఎన్టీఆర్ బేబీ కిట్లను ఉచితంగా అందించేది. ఈ బేబీ కిట్ విలువ కనీసం రూ.1,500 వరకు ఉండేది. ఇందులో బేబీ టవల్, బెడ్, లిక్విడ్ సోప్, దోమ తెర ఉండేవి. పురిటి బిడ్డల సంరక్షణకు ఇవి ఉపయోగపడేవి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించేందుకూ పరోక్షంగా దోహదపడేది.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

ఆ ఐదేళ్లూ కిట్టు ఇస్తే ఒట్టు

2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ పథకం పేరు మార్చింది గానీ కిట్లను మాత్రం అందించలేకపోయింది ఏడాదిలోనే పూర్తిగా స్వస్తి పలికేసింది. దీంతో ఆస్పత్రుల్లో ప్రసవాలు చేసుకున్న తల్లులు ఇబ్బందిపడేవారు. ప్రసవానంతరం కొందరు పాత దుప్పట్లను ఉపయోగించే వారు. దీనివలన పిల్లలు ఇన్‌ఫెక్షన్ల బారిన పడే అవకాశాలుండేవి. ఈక్రమంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఎన్టీఆర్ బేబీ కిట్ల పథకాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 102 పీహెచ్‌సీలు, 16 సీహెచ్‌సీలు, నాలుగు ఏరియా ఆస్పత్రులు, రెండు జిల్లా ఆస్పత్రుల పరిధిలో ఏటా 40 వేలకు పైగా ప్రసవాలు జరుగుతాయి. తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలోనే ఏటా దాదాపు 20 వేలకు పైగా ప్రసవాలు జరుగుతాయి. ఈ క్రమంలో ప్రభుత్వం ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఎన్టీఆర్ బేబీ కిట్లకు ఏటా రూ.6 కోట్లను ఖర్చు చేయనుంది. ఈదిశగా ఇప్పటికే చర్యలను వేగవంతం చేసింది. త్వరలోనే బేబీకిట్లు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తిరుపతి ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి తెలిపారు.

స్టూడెంట్ కిట్స్ గతంకంటే నాణ్యంగా ఉన్నాయి

కిట్స్ స్టాక్ పాయింట్లను పరిశీలించిన రాష్ట్ర పరిశీలకురాలు అనురాధ




బ్యాగ్స్ నాణ్యతను పరిశీలిస్తున్న అనురాధ

తిరుపతి(విద్య), జూన్ 5(ఆంధ్రజ్యోతి): స్టూడెంట్ కిట్స్ గత ఏడాదికంటే నాణ్యంగా ఉన్నాయని రాష్ట్ర పరిశీలకులు, అమరావతి సమగ్ర శిక్ష డిప్యూటీ డైరెక్టర్ అనురాధ పేర్కొన్నారు. గురువారం ఆమె చంద్రగిరి, రేణిగుంట, తిరుపతి రూరల్, అర్బన్, ఏర్పేడు ప్రాంతాల్లోని స్టూడెంట్ కిట్స్ స్టాక్ పాయింట్లను పరిశీలించారు. టెక్స్, నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్స్, పిక్టోరియల్ డిక్షనరీ, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, బ్యాగ్, బెల్ట్, షూస్, మూడు జతల యూనిఫాం క్లాత్ నాణ్యతను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ షూలు, యూనిఫాం తప్ప మిగిలిన అన్ని వస్తువులు ఇప్పటికే పాఠశాలలకు చేరాయని చెప్పారు. అనంతరం తిరుపతి అర్బన్ మండలంలో జరుగుతున్న సీసీహెచ్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీశంకర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ సురేష్, మండల విద్యాశాఖ అధికారులు, సీఆర్పీలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం ఎంపీడీవోకు పదోన్నతి

తిరుపతి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం ఎంపీడీవో బి.ఇందిరమ్మకు ప్రభుత్వం డీఎల్‌డీవో (డివిజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్)గా పదోన్నతి కల్పించింది. వాస్తవానికి ఆమెకు 2021-22లోనే ఈ పదోన్నతి లభించింది. అయితే ఇందిరమ్మతో సహా రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురు ఎంపీడీవోలకు అప్పట్లో డీఎల్‌డీవో పోస్టులు ఇవ్వకుండా ప్రభుత్వం పెండింగులో ఉంచింది. ఈ ముగ్గురిపై శాఖాపరమైన విచారణ పెండింగులో ఉండడం వల్ల ప్రభుత్వం ఆ మేరకు నిర్ణయం తీసుకుంది. అయితే తదుపరి విచారణలో ఈ ముగ్గురిపై వచ్చిన ఆరోపణలు నిరూపణ కాకపోవడంతో పదోన్నతికి అడ్డంకులు తొలగిపోయాయి. ఆ క్రమంలో ప్రభుత్వం ఇందిరమ్మ సహా ముగ్గురికీ డీఎల్‌డీవోగా పదోన్నతి కల్పిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ పదోన్నతి తాత్కాలిక ప్రాతిపదికన చేపడుతున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. పోస్టింగ్ కోసం పీఆర్ శాఖ ముఖ్య కార్యదర్శికి రిపోర్టు చేయాలని ఆదేశించింది.


కల్పవృక్షంపై గోవిందుడి విహారం





తిరుపతిఅర్బన్, జూన్5(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామివారు కల్పవృక్ష వాహనంపై విహరించి భక్తులను కటాక్షించారు. వాహనం ముందు గజరాజులు ఠీవిగా నడుస్తుండగా..భక్తజన బృందాల కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు పట్టి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం 10-11గంటల వరకు స్వామి. అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, పలు రకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. రాత్రి 7-9గంటల వరకు సర్వభూపాల వాహనంపై స్వామివారు భక్తులకు అభయమిచ్చారు. కాగా శుక్రవారం రాత్రి 7-10గంటల వరకు స్వామివారి గరుడ సేవ జరగనుంది.

రేపటి నుంచి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు



అమ్మవారి పుష్కరణితో తెప్పలను ట్రయల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం

తిరుచానూరు అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు శనివారం నుంచి ఐదు రోజుల పాటు ఘనంగా జరగనున్నాయి. మొదటి రోజు శనివారం రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి, రెండవ రోజు సుందరరాజస్వామి, మిగిలిన మూడు రోజుల పద్మావతి అమ్మవారు తెప్పలపై విహరిస్తారు. రాత్రి 7.30గంటలపై ఊరేగే ఉత్సవర్లు తిరుమాడవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షిస్తారు. 10వ తేదీ రాత్రి 8.30గంటలకు అమ్మవారి గజవాహనసేవ, 11న అమ్మవారు గరుడ వాహనంపై ఊరేగి భక్తులకు అభయమివ్వనున్నారు. తెప్పత్సోవాలను పురస్కరించుకుని ఆలయంలో ఐదు రోజుల పాటు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాగా తెప్పోత్సవాలను పురస్కరించుకుని పద్మసరోవరంలో ఇంజనీరింగ్ అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

కొవిడ్ కట్టడిపై మాక్‌డ్రిల్



రుయాలో కొవిడ్ పరీక్ష చేస్తున్న వైద్యులు

తిరుపతి(వైద్యం), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొవిడ్ కేసు నమోదు కావడంతో.. కట్టడికి ముందస్తు చర్యలు ఎలా చేపట్టాలనే అంశంపై అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఇందులో భాగంగా రుయాస్పత్రిలో సూపరింటెండెంట్ రాధ ఆధ్వర్యంలో ఈ మాక్‌డ్రిల్ జరిగింది. కొవిడ్ పరీక్షలు ఎలా నిర్వహించాలి? శాంపుల్స్ ఎలా సేకరించాలి? అవసరమైన మందులు ఎలా సిద్ధం చేసుకోవాలి? ఎలాంటి వైద్యం అందించాలి అనే అంశాలపై ఈ కార్యక్రమం జరిగింది. ప్రత్యేక వైద్యులతో పలువురు సిబ్బందికి కొవిడ్ పరీక్షలు చేయించారు. కొవిడ్ నిబంధనలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ఎంవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా అన్నీ పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, ఏరియా, ప్రాంతీయ ఆస్పత్రుల్లోనూ డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ ఆదేశాల మేరకు కోవిడ్ కట్టడిపై మాక్‌డ్రిల్ నిర్వహించారు.

మిగులు భూములను పచ్చగా మారుద్దాం

● బైరాజుల కండ్రిగలో కలెక్టర్‌తో కలిసి మొక్కలు నాటిన ఎమ్మెల్యే



మొక్కలకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, కలెక్టర్

కేవీబీపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయానికి అనుసంధానం చేస్తూ మిగులు భూముల్లో మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందిస్తున్నట్లు సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. కేవీబీపురం మండలం బైరాజులకండ్రిగ వద్ద డీఎఫ్‌వో విజయ్, ఎఫ్ఆర్వో సెల్వం, అటవీ సిబ్బంది గురువారం ఏర్పాటు చేసిన వనమహోత్సవంలో ఆయన కలెక్టర్‌తో కలిసి మొక్కలు నాటారు. రానున్న కాలంలో మండలం పెద్ద పర్యాటక కేంద్రంగా మారుతుందన్నారు. మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం గొప్పతనమని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక అభివృద్ధి పర్యావరణ కేంద్రంగా మార్చాలని ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందన్నారు. ఇందుకు సంబంధించి అటవీ సిబ్బంది, పరిసర గ్రామస్తులు ఈ ప్రాంతంలో వెయ్యి మొక్కలు నాటి సంరక్షించాలని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో సుమారు 5లక్షల మొక్కలు నాటి బతికించాలని కోరారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో బాపిరెడ్డితో కలెక్టర్ మాట్లాడుతూ.. గిరిప్రదక్షిణకు సమీపంలోని ఈ ప్రాంతాన్ని, రెండున్నర కిలోమీటర్ల రోడ్డును ఎస్ఆర్‌డీఎస్ ద్వారా నిధులు వెచ్చించి అనుసంధానం చేయాలని సూచించారు. జిల్లా పర్యావరణంలో పచ్చదనంలో రెండవ స్థానంలో ఉందన్నారు. ఇకపై మండల స్థాయిలో నర్సరీలను ఏర్పాటు చేసి ప్రభుత్వమే ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తుందని, అవసరమైన మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, వెంకటగిరి ఎఫ్ఆర్వో శివశంకర్‌రెడ్డి, ఎంపీడీవో మాలతి, ఎంఈవోలు లక్ష్మీపతి, రవికుమార్, ఆర్ఐ కరుణాకర్, అటవీ, రెవెన్యూ సిబ్బందితో పాటు మండల టీడీపీ అధ్యక్షుడు రామాంజుల నాయుడు, తిరుపతి పార్లమెంటరీ రైతు అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామియాదవ్, సర్పంచులు విజయ్, ప్రకాష్‌యాదవ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమికి ఆన్‌లైన్‌లో స్థానికేతురాలి పేరు

● ఆలస్యంగా వెలుగు చూసిన వైనం



గురవరాజుపల్లె వద్ద హైవేకి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని శుభ్రం చేసిన దృశ్యం

రేణిగుంట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రెవెన్యూ శాఖలో జరిగిన లీలలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. రేణిగుంట మండలం గురవరాజుపల్లి తెలుగు గంగ రోడ్డులో అప్పటి పాత సర్వే నెంబర్ల ప్రకారం.. గురవరాజుపల్లి లెక్క దాఖల సర్వేనెంబర్ 99/3లో 4.01 ఎకరాలున్నాయి. విమానాశ్రయ పరిసరాల్లో భవిష్యత్తు అవసరాలకు జిల్లా రెవెన్యూ అధికారులు రిజర్వ్ చేసి ఉంచారు. 2018 వరకు ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా ఉన్న ఇదే సర్వే నెంబర్‌ను 90/3 ఏగా మార్చి 3.02 ఎకరాలకు నళిని అనే మహిళ పేరిట రెవెన్యూ వెబ్ లాండ్‌లోకి ఎక్కించారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో మహిళ పేరు చూపుతున్న ఈ సర్వే నెంబర్‌పై తహసీల్దారు డిజిటల్ సంతకం చేయలేదు. అయినా కొంత మంది ఆ భూమిలోకి ప్రవేశించి శుభ్రం చేసినా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అసలు బయట ఊరికి చెందిన మహిళ పేరు వెబ్ లాండ్‌లోకి ఎవరు.. ఎలా.. ఏ హక్కుతో ఎక్కించారు? అనేదానిపై రెవెన్యూ అధికారులు విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. దీనిపై తహసీల్దారు సురేష్ బాబును వివరణ కోరగా.. ఇప్పటి వరకు ఈ విషయం తన దృష్టికి రాలేదని, వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తిరుమలలో పచ్చదనాన్ని 80 శాతానికి పెంచుతాం



మొక్క నాటి నీళ్లు పోస్తున్న అదనపు ఈవో

తిరుమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా తిరుమలలో 70 శాతంగా ఉన్న పచ్చదనాన్ని 80 శాతానికి పెంచేందుకు చర్యలు చేపట్టామని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తిరుమలలోని గోగర్భం డ్యాం వద్దనున్న ఆక్టోపస్ భవనం వద్ద గురువారం ఆయన మొక్కలు నాటారు. తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో రెండు వేల మొక్కలు నాటుతున్నట్టు చెప్పారు. మొత్తం లక్ష మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టామని, ఇప్పటికే మొక్కల కొనుగోలు ప్రక్రియ పూర్తయిందన్నారు. ఇప్పటికే ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తున్నా.. పూర్తిగా ప్లాస్టిక్‌రహిత ప్రాంతంగా మార్చేందుకు పకడ్బందీ ప్రణాళికలు రూపొందించామన్నారు. ప్లాస్టిక్ అనేది ఆరోగ్యానికి, పర్యావరణానికి పెద్ద శత్రువన్నారు. భక్తులు వాహనాల ద్వారా తీసుకువస్తున్న ప్లాస్టిక్‌ను కారు విండోల ద్వారా ఘాట్‌రోడ్లలో విసరడాన్ని గుర్తించామని, దీంతో అధికంగా ప్లాస్టిక్ పేరుకుపోతోందన్నారు. ఈక్రమంలోనే అలిపిరి చెక్‌పాయింట్ గట్టి తనిఖీలు చేయడంతో అవగాహన కల్పిస్తున్నామన్నారు. భక్తులతో పాటు స్థానికంగా ఉండేవారు కూడా పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలన్నారు. విదేశీ మొక్కలు నాటడం ద్వారా స్వదేశీ చెట్లకు హానీ కలుగుతోందన్నారు. అందులో భాగంగానే పూర్తిస్థాయిలో పరిశోధన చేసి 40 స్థానిక మొక్క జాతులను గుర్తించి నాటుతున్నామన్నారు. డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీనివాసులు, డిప్యూటీఈవో సోమన్నారాయణ, ఈఈ సుధాకర్, డీఆర్వో, ఎఫ్ఆర్వోలు దొరస్వామి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

కాళ్లు, చేతులు కట్టేసి.. మహిళ మెడలో నగల అపహరణ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో దోపిడీ దొంగలు చెలరేగిపోతున్నారు. గిరిపురం కాలనీలో మహిళ కాళ్లు, చేతులు కట్టేసి మెడలో ఉన్న బంగారు నగలు అపహరించుకెళ్లారు. బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. గిరిపురం కాలనీకి చెందిన బాలచంద్ర గురువారం మధ్యాహ్నం తలుపులు తెరచి వాష్‌రూముకు వెళ్లాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇద్దరు ఇంట్లోకి ప్రవేశించారు. ఆయన భార్య గిరిజతో మాటలు కలుపుతూ కొంతసేపటికి తాళ్లతో చేతులు, కాళ్లు కట్టేశారు. అరిస్తే చంపేస్తామని బెదిరించి మెడలో ఉన్న 40 గ్రాముల బంగారు చైను లాక్కొని పరారయ్యారు. వాష్‌రూము నుంచి బయటకు వచ్చిన భర్తకు ఆమె జరిగిన విషయం చెప్పింది. వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ మురళీమోహన్ అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మెగా డీఎస్సీ పరీక్షలు పక్కాగా నిర్వహించాలి

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 5(ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలో శుక్రవారం నుంచి మెగా డీఎస్సీ పరీక్షలను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో డీఎస్సీ పరీక్షలపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షల కోసం జిల్లాలో 8 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఏడేళ్ల తర్వాత నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. లోపాలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. 33.607మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఉదయం 9.30 నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు సెషన్సులో జరుగుతాయని, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఆర్డీవోలు, జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్, అదనపు డీఎస్పీ శ్రీనివాసులు, డీఎంహెచ్‌వో బాలాజీ నాయక్, అధికారులు పాల్గొన్నారు.

డీఎస్సీకి పటిష్ఠ భద్రత

తిరుపతి(నేరవిభాగం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీకి పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశామని ఎస్పీ హర్షవర్ధన రాజు చెప్పారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 8 కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

నూతన ఆర్ఐవోగా రాజశేఖరరెడ్డి



తిరుపతి(విద్య), జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యామండలి తిరుపతి ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్ఐఓ)గా ఎ.రాజశేఖరరెడ్డి గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటివరకు ఆర్ఐఓగా ఉన్న ప్రభాకర్‌రెడ్డి స్థానంలో జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న రాజశేఖర్‌ను నియమిస్తూ ఇంటర్ విద్యామండలి ఉత్తర్వులు వెలువరించింది. ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలు ఇంటర్ బోర్డు విధి విధానాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రవేశాలు, కళాశాలల్లో వసతి సౌకర్యాలు బోర్డు నియామావళి ప్రకారం ఉండాలని చెప్పారు. అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలను పెంచేందుకు ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు కృషి చేయాలని కోరారు. అన్ని యాజమాన్య కళాశాలల్లో యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సూచించారు.

వనసంరక్షణ సమితుల సృష్టికర్త చంద్రబాబు



యల్లశిరి వనసంరక్షణ సమితి ప్రతినిధులకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్, అటవీశాఖ అధికారులు

కోట, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించేందుకు వనసంరక్షణ సమితులను ఏర్పాటు చేసిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని చిట్టేడు, కోటలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నాయకులు, అటవీశాఖ అధికారులు చిట్టేడులోని సునామి రక్షిత పరిశోధన కేంద్రంలో మొక్కలు నాటారు. అనంతరం కోటలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉమ్మడి యాజమాన్య కార్యక్రమంలో భాగంగా వనసంరక్షణ సమితులకు 50శాతం షేర్ క్యాపిటల్ కింద రెండు కోట్ల ఆరులక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి దత్తత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు జయ జయరావు, ఎంపీడీవో దిలీప్‌కుమార్, అటవీశాఖ అధికారులు బీవీ రమణయ్య, గాయం శ్రీనివాసులు, ధనలక్ష్మి, టీడీపీ నాయకులు సర్వోత్తమరెడ్డి, జలీల్ అహ్మద్, దశరధరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, తీగల సురేష్‌బాబు, సురేష్ నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, చిట్టమూరు, వాకాడు నాయకులు కిషోర్‌నాయుడు, రాజేష్‌రెడ్డి, మధురెడ్డి, సర్పంచ్ వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పర్యావరణ దినోత్సవం

సూళ్లూరుపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో పర్యావరణ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల్లో ప్లాస్టిక్ వినియోగం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తపాలా కార్యాలయం వద్ద రైల్వేస్టేషన్ రోడ్డులో మాజీ ఎమ్మెల్యే నెలవల చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, చిట్టేటి పెరుమాల్, మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

పెళ్లకూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో అధికారులతో కలసి టీడీపీ నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు దొమ్మరాజు సత్యనారాయణ రాజు, మదన్‌మోహన్ నాయుడు, సిద్దులయ్య నాయుడు, సుందరరామిరెడ్డి, గుంటపూడి రమణయ్య, కాండ్ర రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

చిట్టమూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో మనోహర్ గౌడ్ కోరారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చిట్టమూరు పీహెచ్‌సీ, డంపింగ్ యార్డ్, పోలీస్ స్టేషన్, మండలంలోని సచివాలయాలు, పాఠశాలల్లో మొక్కలు నాటారు. ఎస్ఐ చిన్న బలరామయ్య, వైద్యాధికారిణి పద్మావతి, ఏపీవో షీలు, వెంకటేశ్వర్లు, ఎఫ్ఏ నాగరాజు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో పర్యావరణ దినోత్సవం

కోట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, డీడీ మల్లికార్జున్ రెడ్డి, కోఆర్డినేటర్లు డాక్టర్ మాధవయ్య, విభాగాధిపతులు, విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అదే విధంగా సిద్ధవరంలో ఏఆర్‌డీ సంస్థ ప్రతినిధి రామాంజనేయులు ఆధ్వర్యంలో గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది మొక్కలు నాటి దత్తత తీసుకున్నారు.

గురుకులంలో సమస్యలను పరిష్కరించండి

చిల్లకూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, పూర్వ విద్యార్థులు కంటేపల్లి వెంకటేశ్వర్లు, సురేష్ గురువారం తిరుపతిలో డీసీవో గీతాకు విజ్ఞప్తి చేశారు. గురుకులంలోని ఆర్‌వో ప్లాంటు, తాగునీటి కొళాయిలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు శిథిలమైన ప్రహరీని తొలగించి కొత్తది నిర్మించాలని డీసీవోకు విన్నవించారు. ఆమెకు మొమెంటోను అందజేసి శాలువాతో సత్కరించారు.

టీడీపీలో చేరిన 30 కుటుంబాలు

వాకాడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలిరెడ్డిపాళెం పంచాయతీ, బండ్లదిబ్బ, నేతకాయల ఊరు గ్రామానికి చెందిన 30 కుటుంబాలు గుండాల శ్యామ్‌సుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సమక్షంలో టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, దయాకర్, శ్రీనివాసులు, జనార్ధన్‌రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో షార్ట్ సర్క్యూట్

కోట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉత్తమనెల్లూరు ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం షార్ట్ సర్క్యూట్ జరిగింది. తరగతి గదిలోని ఫర్నిచర్, పుస్తకాలు దగ్ధమయ్యాయి. ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

7 సవర్ల బంగారు నగల చోరీ

నాయుడుపేట టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలాజీ గార్డెన్‌లో 7 సవర్ల బంగారు నగలు, 60వేల నగదు చోరీకి గురైనట్లు బాధితురాలు మాధవి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శనివారం ఉదయం కుటుంబసభ్యులు ఇంటికి తాళాలు వేసుకొని ఊరికి వెళ్లారు. గురువారం ఉదయం వచ్చి చూసేసరికి బీరువాలో ఉన్న 7 సవర్ల బంగారు నగలు, రూ.60వేల నగదు లేకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

వాకాడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన శ్యామ్‌సుందర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండడంతో సీఎం సహాయనిధి నుంచి రూ.5.50 లక్షలు మంజూరైంది. గురువారం ఎమ్మెల్యే సునీల్‌కుమార్ చెక్కు అందజేశారు.

వ్యాన్ ఢీకొని గురుకులం అటెండర్ దుర్మరణం



మృతి చెందిన నూర్‌షబ్‌జాన్

దొరవారిసత్రం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం విద్యుత్ శాఖ కార్యాలయం ఎదురుగా జాతీయ రహదారిపై గురువారం రాత్రి టెంపో వ్యాన్ ఢీకొట్టడంతో గురుకులం అటెండర్ నూర్‌షబ్‌జాన్(54) దుర్మరణం చెందారు. దొరవారిసత్రం బీసీ గురుకుల పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న నూర్ షబ్‌జాన్ గురువారం రాత్రి రహదారి దాటుతుండగా, చెన్నై వైపు వెళ్లే టెంపో వ్యాన్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి వెంటనే వాహనాని అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ అజయ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.





కోట్లాది రూపాయలు విలువచేసే ప్రభుత్వ సీజేఎస్ఎఫ్ భూములు - కబ్జా చేసేందుకు కంచె వేసిన ఆక్రమణదారులు

సీజేఎస్ఎఫ్ భూముల్లో పెద్దల పాగా!

కోట్ల విలువైన భూములు కొట్టేసేందుకు స్కెచ్ ● రాత్రికి రాత్రే యూకలిప్టస్ మొక్కలు నాటేస్తున్న ఆక్రమణదారులు

కోట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను కొట్టేసేందుకు పెద్దలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కోట్లాది రూపాయలు విలువచేసే సీజేఎస్ఎఫ్, డీకేటీ భూములను పాత సర్వే స్కెచ్‌లతో ఆక్రమించుకుని రాత్రికి రాత్రే యూకలిప్టస్ మొక్కలు నాటేస్తున్నారు. కోట మండలం చెందోడు, గూడలి పంచాయతీ పరిధిలోకి చంద్రశేఖరపురం సమీపంలో ఉన్న సీజేఎస్ఎఫ్, డీకేటీ భూములు ఉన్నాయి. గూడలి పంచాయతీ బిట్-2 పరిధిలోకి సర్వే నెంబరు 249-2, 291లో 3లో సుమారు 300 ఎకరాలకు పైగా సీజేఎస్ఎఫ్, డీకేటీ భూములు ఉన్నాయి. ఇందులో 1992లో జర్నలిస్టులకు, జోగిని వృత్తిని కొనసాగించే మాతమ్మలకు ఇంటి స్థలాలు ఇచ్చారు. అప్పట్లో అవి ఎందుకూ పనికిరాకుండా ఉండటంతో పట్టాలు పొందిన కొందరు భూములను వదిలేయగా, కొంతమంది సీజేఎస్ఎఫ్, డీకేటీ పట్టాదారులు భూస్వాములు, వ్యాపారవేత్తలకు కారుచౌకగా అమ్మేశారు. అప్పటి నుంచి ఆ భూముల్లోకి ఎవరూ ప్రవేశించకపోవడంతో బీళ్లుగా ఉంటూ వచ్చాయి. ప్రస్తుతం వీటి పక్కనే సాగరమాల సిక్స్ లేన్ రోడ్డు పనులు జరుతుండటంతో భూములకు విలువ పెరిగింది. గూడలి పరిధిలోని చంద్రశేఖరపురం చెరువు సమీపంలో సుమారు 80 ఎకరాలు సాగరమాల ఫ్లైఓవర్ సమీపంలో ఉన్నాయి. దీంతో ఈ భూములను సొంతం చేసుకునేందుకు కొందరు ప్రయత్నాలు మొదలెట్టారు. రాత్రికి రాత్రే కొంతమంది యూకలిప్టస్ చెట్లను నాటగా, కొంతమంది కంచె నిర్మించారు.

సీజేఎస్ఎఫ్ భూముల రికార్డులు తారుమారు

సీజేఎస్ఎఫ్ భూములను డీకేటీగా మార్చేందుకు 2018లో అప్పటి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో గూడూరు, నాయుడుపేట, నెల్లూరుకు



చంద్రశేఖరపురం సమీపంలో నిర్మాణంలో ఉన్న సాగరమాల ఫ్లైఓవర్

చెందిన కొంతమంది వ్యాపారస్తులతో పాటు కొంతమంది స్థానికులు నకిలీ పాస్ పుస్తకాలు సృష్టించుకున్నట్లు సమాచారం. ఇందుకోసం అప్పట్లో పనిచేసిన వీఆర్వోలు, సర్వేయర్లు ఎంజాయ్‌మెంట్ స్కెచ్ ఇచ్చి సహకరించినట్లు సమాచారం. ప్రస్తుత అధికారులు స్పందించి విచారణ జరిపితే అక్రమాలు విషయాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై తహసీల్దారు జయజయరావు స్పందిస్తూ చంద్రశేఖరపురం సమీపంలో ఉన్న సీజేఎస్ఎఫ్, డీకేటీ భూములపై తక్షణం విచారణ చేపడుతామన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది జగన్ తీరు: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, పక్కన టీడీపీ నేతలు సుధాకర్ రెడ్డి, ఏజీ కిషోర్, మాధవనాయుడు

సూళ్లూరుపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం సూళ్లూరుపేటలోని రైల్వేగేటు వద్దనున్న టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలసి నెలవల మీడియాతో మాట్లాడారు. ప్రజాధారణ కోల్పోయిన వైసీపీ ప్రజలు తీర్పు ఇచ్చిన రోజున వెన్నుపోటు దినం నిర్వహించడం దారుణమన్నారు. ప్రజాతీర్పును శంకిస్తే ఈ సారి సింగిల్ డిజిట్‌కే వైసీపీ పరిమితం కావడం ఖాయమన్నారు. రాజకీయ లబ్ధికోసం సొంత చిన్నానను గొడ్డలి పోటుతో చంపించిన జగన్ వెన్నుపోటు గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కన్న తల్లికి, చెల్లికి, పార్టీ కార్యకర్తలకు వెన్నుపోటు పొడిచిన చరిత్ర జగన్‌దేనని విమర్శించారు. ఐదేళ్లలో వైసీపీ చేయని పనులను ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసి చూపించదన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, రహదారుల మరమ్మతులు, ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చిందని, ఈ నెలలో తల్లికి వందనం, ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇలా ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు సూపర్ సిక్స్ పథకాల అమలుకు ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు చేస్తున్నా వైసీపీ విషం చిమ్మడం దుర్మార్గమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు దూరదృష్టితో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. యువ నాయకుడు లోకేశ్ విద్యా రంగం ప్రత్యేక దృష్టి పెట్టి తొలిసారిగా మెగా డీఎస్సీ నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఐదేళ్లలో ఒక పరిశ్రమను నెలకొల్పకపోగా... ఉన్నవాటిని తరిమేశారని, డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ పేరిట అబద్ధపు మాటలు చెప్పి విధ్వంస పాలన సాగించిన జగన్‌కు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవ నాయుడు, చిట్టేటి పెరుమాల్, వాకచర్ల రమేష్, శ్రీనివాసులు, లోకేశ్ నాయుడు, బొమ్మన్ పళణి పాల్గొన్నారు.

తమ్ముడి మీద కోపంతో... అన్నపై హత్యాయత్నం



దాడిలో గాయపడిన అంకయ్య

నాయుడుపేట టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తమ్ముడి మీద కోపంతో... అన్నను హత్య చేసేందుకు ప్రయత్నించారు. నాయుడుపేట మండలం కాపులూరు గ్రామంలో నివాసం ఉంటున్న అంకయ్య కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తుంటాడు. అంకయ్య తమ్ముడు సురేష్ కొద్దిరోజుల క్రితం అదే గ్రామానికి చెందిన వివాహితను తీసుకొని వెళ్లిపోయాడు. దీంతో వివాహిత కుటుంబసభ్యులు అంకయ్య తమ్ముడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ్ముడి మీద కోపంతో అంకయ్య మీద పగ పెంచుకొని ఆయనను హతమార్చేందుకు వివాహిత కుటుంబసభ్యులు పథకం పన్నారు. బుధవారం సాయంత్రం ఇంటి వద్ద ఉన్న అంకయ్యతో మాట్లాడారు. అతని తమ్ముడితో పాటు మహిళ గ్రామ సమీపంలో ఉన్న స్వర్ణముఖినది వద్ద ఉన్నట్లు గుర్తించామని, మందలించి తీసుకువద్దామని నమ్మబలికారు. దీంతో అంకయ్య వారితో స్వర్ణముఖినది వద్దకు వెళ్లాడు. అక్కడే అందరూ కలిసి మద్యం తాగారు. అదే సమయంలో వివాహిత కుటుంబసభ్యులు అంకయ్య తలపై దాడి చేశారు. నిన్ను ఇక్కడే హత మారుస్తామని హెచ్చరించడంతో అంకయ్య అక్కడ నుంచి తప్పించుకొని గ్రామానికి చేరుకున్నాడు. జరిగిన సంఘటనను గ్రామస్తులకు వివరించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పెంచాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

కోట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచాలని విజయవాడకు చెందిన చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు సుబ్రహ్మణ్యం, వరలక్ష్మి కోరారు. కోటలోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. వంటల పోటీలు నిర్వహించారు. మంచి వంటలు తయారు చేసిన వారికి ఎంఈవో మస్తానయ్య చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో గురువారం రెడ్‌సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్‌క్లబ్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విష్ణువందన, డాక్టర్ రోహిణి, డాక్టర్ తనూజ, శశిరేఖ, జానా సుధీర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

కరోనా కలకలం

- ఆరుగురికి పాజిటివ్‌గా నిర్ధారణ
- ఆర్టీపీసీఆర్ పరీక్షల్లో వెలుగులోకి..
- జిల్లావ్యాప్తంగా బాధితుల గుర్తింపు
- అందరూ హోం ఐసోలేషన్‌లోనే
- ప్రమాదం లేదంటున్న వైద్యులు

నెల్లూరు (వైద్యం), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మహమ్మారి కొవిడ్ మళ్లీ కలకలం రేపుతోంది. నెల్లూరు జిల్లాలో ఒకేసారి ఆరుగురికి పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో వైద్య వర్గాలను కలవరపాటుకు గురిచేసింది. బాధితుల్లో ఒకరిది తిరుపతి జిల్లాలోని గూడూరు. మిగిలిన ఐదుగురూ నెల్లూరు జిల్లావాసులే. నగరంలోని ఇద్దరు నర్సింగ్ విద్యార్థులు కొవిడ్ బారిన పడ్డారు. వీరిలో ఓ విద్యార్థిని రెండు రోజుల క్రితం కేరళ నుంచి నెల్లూరుకు వచ్చింది. అలాగే భక్తవత్సల నగర్‌కు చెందిన 60 ఏళ్ల వ్యక్తికి కూడా కరోనా సోకినట్లు అధికారులు గుర్తించారు. వెంకటాచలం మండలం అనికేపల్లికి చెందిన ఓ యువకుడు, నెల్లూరు రూరల్ మండలానికి చెందిన మరో యువకుడూ కరోనా బారిన పడినట్లు అధికారులు గుర్తించారు. ఈ ఆరుగురికి రెండు రోజుల క్రితం కరోనా ర్యాపిడ్ పరీక్ష చేశారు. ఇందులో పాజిటివ్‌గా వచ్చింది. దీంతో ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేయగా కరోనా నిర్ధారణ అయింది. వీరు జలుబు, జ్వరం, కీళ్ల నొప్పులతో వైద్యులను సంప్రదించటంతో విషయం వెలుగులోకి వచ్చింది.

జీజీహెచ్‌లో 30 పడకలు

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కరోనా బాధితులకు వైద్యసేవలు అందించేందుకు ఇప్పటికే 30 పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. కరోనా పాజిటివ్ కేసులు ఎక్కువ అయితే జీజీహెచ్‌లో చికిత్స అందిస్తారు. ప్రస్తుతం నమోదైన కేసులు ప్రాథమిక స్థాయిలోనే ఉండటంతో బాధితులను హోం ఐసోలేషన్‌లోనే ఉంచి చికిత్స అందిస్తున్నారు.

ప్రాథమిక దశలోనే..

జిల్లాలో ఆరుగురికి కరోనా పరీక్షలు చేయగా అందరికీ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. వీరంతా హోం ఐసోలేషన్‌లో ఉన్నారు. కరోనా తీవ్రత మాత్రం లేదు. ప్రాథమిక దశలోనే నిర్ధారణ అయింది.

- డాక్టర్ సుజాత, డీఎంఅండ్‌హెచ్‌వో

జాగ్రత్తలు తీసుకోవాలి

కరోనా బాధితులతో అనుబంధంగా ఉన్న వారందరికీ పరీక్షలు చేశాం. చుట్టు పక్కల వారు జాగ్రత్తలు తీసుకోవాలి. మాస్కులు, శానిటైజర్లు, ప్రస్తుత బాధితులకు వచ్చిన కరోనా తక్కువ స్థాయిలో ఉండటంతో ఎలాంటి ప్రమాదం లేదు.

- డాక్టర్ భాస్కర్, ఎపిడమాలజిస్ట్

పుత్తూరు వార్తలు

టన్ను మామిడికి రూ.12 వేలు చెల్లించాలి: సీపీఎం



మామిడి రైతుల సమస్యలపై మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పుత్తూరు టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): టన్ను మామిడి పంటకు రూ.12 వేలు చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం ఆయన పుత్తూరు పట్టణంలోని మామిడి కాయల మండీలో సమస్యలపై రైతులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు ఫ్యాక్టరీ యజమానులతో, రైతులతో, రైతు సంఘాలతో చర్చించి టన్నుకు రూ.12 వేలు చొప్పున చెల్లించేలా ఆదేశాలు ఇచ్చినా ఆచరణలో అమలుకావడం లేదని అన్నారు. గుజ్జు ఫ్యాక్టరీ యజమానులు సిండికేట్‌గా మారి మామిడి రైతులను తక్కువ ధరలతో మోసం చేస్తున్నారన్నారు. జిల్లాలో మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, టీటీడీ కూడా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు గిట్టుబాటు ధర రాకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత, జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, పుత్తూరు కార్యదర్శి వెంకటేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర

పుత్తూరు టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండలం దిగువగూళూరులో గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం గెరిగెను భక్తి శ్రద్ధలతో గ్రామ పొలిమేర్ల వరకు ఊరేగించారు. అనంతరం అమ్మవారికి అభిషేకాలు, నిత్య పూజా కైంకర్యాలు నిర్వహించి, నడివీధిలో ప్రతిష్ఠించారు. భక్తులు తయారు చేసిన వంటకాలను కుంభం పోసి మొక్కులు తీర్చుకున్నారు. అఖండ దీపారాధన చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలంకరించిన వెయ్యి దుత్తలను భక్తులు తల మీద పెట్టుకుని అమ్మవారిచుట్టూ ప్రదక్షిణలుచేసి మొక్కులు తీర్చుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

● ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

పుత్తూరు అర్బన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం పున్నమి కూడలిలో మొక్క నాటి నీరు పోశారు. అనంతరం వృక్షసంపదను పెంచుదాం.. పచ్చదనాన్ని కాపాడుకుందాం అంటూ పిలుపునిచ్చారు. స్వచ్ఛమైన ఆహ్లాదకరమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. నాటిన ప్రతీ మొక్కను కాపాడాల్సిన బాధ్యతను తీసుకోవాలన్నారు. పచ్చదనాన్ని పెంపొందించేందుకు తన తండ్రి, దివంగత అటవీశాఖ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు పలు కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, ఎంపీడీవో రమేష్‌బాబు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పర్యావరణ పరిరక్షణకు కృషి

● సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ రాఘవేంద్ర

పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సి రాఘవేంద్ర పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ రాఘవేంద్ర, జూనియర్ సివిల్ జడ్జి రమ్య సాయి మొక్కలు నాటారు. చెట్లు ప్రగతికి మెట్లు అన్నారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని తెలిపారు. భవిష్యత్తు తరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గాలి సురేష్‌బాబు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ రాఘవేంద్ర, జూనియర్ సివిల్ జడ్జి రమ్య సాయి

చెట్లను పెంచితే ఆయుష్షు పెరుగుతుంది

వడమాలపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీల్లో అధికారులు, నాయకులు నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డుకిరువైపులా మొక్కలు నాటారు. ఎంపీడీవో శేషగిరిరావు రామసముద్రంలో మొక్కలు నాటారు. కదిరిమంగళంలో అటవీశాఖ అధికారులు శంకరప్ప, ఖ్యాతి, మునియా నాయక్, రాము ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, నాయకులు ధనంజయులు నాయుడు, వెంకటయ్య, ఢిల్లీ ప్రసాద్, శివరాయల్, కార్యదర్శి రితేష్, అంగన్వాడీ సూపర్‌వైజర్ రోజారమణి, ఉపాధి ఏపీవో హంసవేణి, ఏఈ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భావితరాల కోసం ప్రకృతిని రక్షించాలి



మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ విద్యార్థులు

పుత్తూరు (ఆంధ్రజ్యోతి): భావితరాల కోసం ప్రకృతిని రక్షించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ వీరయ్య అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం కళాశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలను నాటారు. ప్రకృతిని నాశనం చేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరి పారేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నాగేశ్వర రావు, రఘురామన్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలు ఛీత్కరించినా వైసీపీ నాయకుల్లో మార్పులేదు

● ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఛీత్కరించినప్పటికీ వైసీపీ నాయకుల్లో ఏమాత్రం మార్పు రాలేదని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బుధవారం వైసీపీ నాయకులు చేసిన వెన్నుపోటు దినం కార్యక్రమం టీ కప్పులో తుపానులా ఉందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెంచిన పింఛన్లు ఇవ్వడం, బకాయిలు కూడా చెల్లించడం వైసీపీ నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నిరుద్యోగులకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌తో పాటు ఉపాధి అవకాశాలు అందిస్తున్నట్లు గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం వలంటీర్ల ఉద్యోగాలు ఇచ్చి ఉపాధి కల్పించామని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని, వారికి మరెక్కడా ఉద్యోగావకాశాలు లేకుండా నిలువునా మోసం చేశారని మండిపడ్డారు. ఒక వైసీపీ నాయకుడు, స్మగ్లర్‌ను పోలీసులు విచారణ చేస్తే, దానికి వైసీపీ ఓదార్పుయాత్ర చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో వైసీపీ క్యాడర్‌కు తగినట్లుగా నగరి నియోజకవర్గంలో ఒక మాజీ మంత్రి తందాన తాన అంటూ వంతు పాడుతున్నారని, ప్రజలు గత ప్రభుత్వం చేసిన అన్యాయాలను ఏమి మరవలేదని తెలిపారు. వారు చేసిన కుంభకోణాలు, భూ కబ్జాలు, అక్రమాలు, తీసుకున్న లంచాలు, దౌర్జన్యాలు అన్ని లెక్కలు ఉన్నాయని, అన్నింటికి సమాధానం చెప్పాల్సిన పరిస్థితి దగ్గరలోనే ఉందని అన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ధనపాల్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, వ్యవసాయ కమిటీ చైర్మన్ గణేష్, మాజీ ఎంపీపీ డీఎన్ ఏలుమలై, బీసీ సంఘ నాయకులు షణ్ముగరెడ్డి, టీఎన్‌టీయూసీ అధ్యక్షులు రావిళ్ల మాధవనాయుడు, తడుకు సర్పంచ్ బొబ్బిలి, కరుణాకర్‌యాదవ్, ఆనంద్, హమీద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మొబైల్ యాప్‌ల ప్రాముఖ్యతను రైతులు గుర్తించాలి

వడమాలపేట, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మొబైల్ యాప్‌ల ప్రాముఖ్యతను రైతులు గుర్తించాలని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి శాస్త్రవేత్త భరత్‌కుమార్ చెప్పారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని కాయంపేట, పత్తిపుత్తూరు, చింతకాల్వ గ్రామాల్లో రాస్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. రైతులకు సబ్సిడీపై జనుము విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రామ్‌కుమార్, శ్రీనివాసులు, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఉమాపతి రావ్, రమేష్, వ్యవసాయాధికారి విజయ్‌కుమార్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో ఘనంగా పర్యావరణ దినోత్సవం

● మొండలైజ్, బెర్జిన్ పైప్స్ పరిశ్రమల్లో సోలార్‌ప్లాంట్ల ప్రారంభం



మొండలైజ్‌లో సోలార్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రవీంద్ర సన్నారెడ్డి, వెంకట్ వేనేపల్లి, రట్జర్ ఆల్‌బర్ట్ తదితరులు

వరదయ్యపాళెం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ హిత ప్రమాణాలతో సుస్థిర అభివృద్ధి దిశగా పయనిస్తున్న శ్రీసిటీలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీపొల్యూషన్ కంట్రోల్ బోర్డు తిరుపతి జోనల్ కార్యాలయ సీనియర్ పర్యావరణ ఇంజనీర్ ఎస్ఎస్ మురళి విచ్చేసి స్థానిక ఎలక్ట్రానిక్ మ్యానుఫాక్చరింగ్ క్లస్టర్‌లో మియావాకి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. శ్రీసిటీ చేపట్టిన పర్యావరణ హిత చర్యలను అభినందించారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ రెడ్యూస్, రియూజ్ రీసైకిల్ (3ఆర్) విధానం పర్యావరణ పరిరక్షణకు ఎంతో అనువైందన్నారు. శ్రీసిటీలో సుస్థిరిత, కాలుష్య నివారణ, వ్యర్థ పదార్థాల నిర్వహణకు పై విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు గ్రీన్ అండ్ క్లీన్ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డితో కలిసి మొండలైజ్ పైప్స్ పరిశ్రమల సప్లై వైస్ ప్రెసిడెంట్ వెంకట్ వేనేపల్లి, బెర్జిన్ సోలార్ యూనిట్ హిల్ అండ్ స్మిత్ హోల్డింగ్స్ సీఈవో రట్జర్ ఆల్‌బర్ట్‌లు 350 కిలోవాట్ల సోలార్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఉద్యానశాఖ విభాగాధికారి మధుసూదన్‌రెడ్డి, ఏపీపీసీబీ పర్యావరణ ఇంజనీర్ సుధీర్, శ్రీసిటీ పర్యావరణ ఇంజనీర్ వెంకట్, సత్యవేడు అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



ప్రత్యేక అలంకారంలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు పరిశీలన



కైలాసగిరి రిజర్వాయర్ వద్ద ఫ్లోటింగ్ సోలార్‌ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్

శ్రీకాళహస్తి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం కైలాసగిరి రిజర్వాయర్‌లో స్మార్ట్‌సిటీ నిధులతో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. కేవీబీపురం మండలంలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న చిన్నారి

కేవీబీపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బైరాజులకండ్రిగ వద్ద డీఎఫ్‌వో విజయ్, ఎఫ్ఆర్వో సెల్వం, అటవీ సిబ్బంది ఏర్పాటు చేసిన వనమహోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ వెంకటేశ్వర్ రాక సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. కలెక్టర్ రావడం కొంత ఆలస్యం కావడంతో శ్రీకాళహస్తి ప్రభుత్వ బాలికల, బాలుర పాఠశాలలు, దిస్కూల్‌కు సంబంధించిన చిన్నారులతో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేయించారు. చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కలెక్టర్ వచ్చిన తరువాత కూడా చిన్నారులు స్వాగత మాలతో చేసిన ప్రదర్శన పట్ల ఆయన ముగ్ధులయ్యారు. అనంతరం పలు శాఖల అధికారులకు అటవీశాఖ సిబ్బంది మొక్కలను పెంచుకోవడానికి పంపిణీ చేశారు.

కొవిడ్‌పై మాక్‌డ్రిల్



వైద్య సిబ్బందికి అందజేసిన కొవిడ్ కిట్లు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కరోనా కేసు అయిన నేపథ్యంలో స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొవిడ్‌పై మాక్‌డ్రిల్‌ను వైద్యాధికారిణి మాధవి అధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరికైనా జలుబు, జ్వరము, దగ్గు, వాసన, రుచి తెలియకపోవడం వంటి లక్షణాలు ఉన్న వారిని వైద్య సిబ్బంది గుర్తించి ఆరోగ్య కేంద్రానికి పంపితే కొవిడ్ పరీక్షలు చేసి, నిర్ధారణ అయితే చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ప్రజలు మాస్కులు ధరించడం, చేతులు తరుచూ శుభ్రం చేసుకోవడం, సామాజిక దూరం పాటించడం, సినిమాలు శుభకార్యాలకు దూరంగా ఉండటం, తుమ్మినప్పుడు చేతి రుమాలు గాని, చేతిని గాని అడ్డుగా ఉంచుకోవడం తదితర జాగ్రత్తలు పాటించే విధంగా అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ వాయిదా వేయాలి

శ్రీకాళహస్తి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఎస్‌సీఆర్‌టీ చేపట్టిన శిక్షణ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వారు మాట్లాడుతూ ఎస్‌సీఆర్‌టీ వారు ఈ నెల 9, 10, 11 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారన్నారు. కానీ స్కూల్ అసిస్టెంట్లు బదిలీలు కావడంతో ఆ ప్రాంతాలు చాలా దూరంలో ఉంటాయని, దీంతో వారు కుటుంబాన్ని, సామాన్లు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈక్రమంలో శిక్షణ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు మురళీకృష్ణ, బాలసుబ్రహ్మణ్యం, వెంకటాద్రి, గోపాల్, జయకర్, కుమార్, రమేష్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

కేవీబీపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవనూరుకు చెందిన టీడీపీ కార్యకర్త పిడుగు కృష్ణయ్య గత నెల 27న అనారోగ్యంతో మరణించాడు. టీడీపీ నాయకుడు వెంకటయ్యకు సోదరుడైన కృష్ణయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం పరామర్శించి, ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించుకుందాం

● ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



మొక్క నాటుతున్న సుధీర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, మౌర్య, సుగుణమ్మ

రేణిగుంట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం తుడా ఆధ్వర్యంలో స్థానిక పాత చెక్ పోస్ట్ కూడలిలో తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, రాష్ట్ర గ్రీనరీ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ సుగుణమ్మతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం తుడా వైస్ చైర్మన్ మౌర్య అందరి చేత పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు హరితాంధ్ర విజన్‌తో రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది మొక్కలను నాటించారని గుర్తు చేశారు. 50 వేల మొక్కలను తుడా అందిస్తే శ్రీకాళహస్తి నియోజకవర్గ వ్యాప్తంగా నాటిస్తామని ఆయన తెలిపారు. తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ కాలుష్యాన్ని నియంత్రించాలంటే మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్తు తరాలకు మంచి చేసిన వాళ్లమవుతామని చెప్పారు. తుడా పరిధిలో దాదాపు 30 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించుకున్నామన్నారు. రేణిగుంట మండల పరిధిలోని చెరువులను తుడా నిధులతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. తహశీల్దార్ సురేష్ బాబు, ఈవోపీఆర్డీ ప్రభురావు, పంచాయతీ కార్యదర్శి మణి, టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు మునిచంద్రారెడ్డి, మెహబూబ్‌బాషా, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం రెడ్డి, నాయకులు బుజ్జి నాయుడు, మునస్వామి నాయుడు, నాదముని రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కన్నన్‌రెడ్డి, రవి, ఎంజీ రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● శ్రీకాళహస్తి (ఆంధ్రజ్యోతి): పర్యావరణమే భావితరాల భవిష్యత్తు అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ అన్నారు. పట్టణంలోని 34వ వార్డు పరిధిలో టీడీపీ నాయకులు, గాండ్లతెలికుల బీసీ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు కన్నావరం హరిబాబు ఆధ్వర్యంలో జరిగిన మొక్కల పంపిణీ కార్యక్రమంలో బృందమ్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించి పర్యావరణ హితానికి తోడ్పడాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతి నాయుడు, దశరథాచారి, పార్లమెంటు రైతు ఉపాధ్యక్షుడు ప్రకాష్ నాయుడు, నాయకులు గాలి మురళి నాయుడు, పేట బాలాజీరెడ్డి, మోహన్ గౌడ్, పోలూరు శ్రీనివాసులరెడ్డి, కాళ్లపరెడ్డి, ఎంఎస్ రెడ్డి, ఆర్ముగం, మురళిరెడ్డి, వజ్రం కిషోర్, వెంకటేష్, ప్రకాష్, మునిరాజా యాదవ్ తదితరులు పాల్గొన్నారు. కాగా మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు పట్టణంలోని గోపాలవనం ప్రాంతంలో మొక్కలు నాటారు. ఎస్సీవీ దిలీప్, ఎస్సీవీ కిరణ్, భాస్కర్ నాయుడు, జానకి రామానాయుడు, గోపి నాయుడు, సుబ్రహ్మణ్యం, సుదర్శన నాయుడు, ఢిల్లీ ప్రతాప్, శివ, మధు, గాలి సుబ్రహ్మణ్యం, పసల బాబు తదితరులు పాల్గొన్నారు. పట్టణ శివారులోని ఏపీ టూరిజం వద్ద జరిగిన వనం మనం కార్యక్రమంలో భాగంగా ఏపీ టూరిజం చైర్మన్ కసాని బాలాజీ, తిరుపతి డివిజనల్ మేనేజరు సీహెచ్ శ్రీనివాస్ ఆదేశాలతో సుమారు 25 మొక్కలను నాటారు. పరమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఎస్వీయే ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణంలో ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ అధికారి హరికృష్ణ, అధ్యాపకులు దుర్గారావు, విజయసారథి, గిరిప్రసాద్, మనోహన్, విద్యార్థులు పాల్గొన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో తెలుగుగంగ కాలనీలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షులు విజయకుమార్ పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో పురపాలసంఘ అధికారులు, టీడీపీ నాయకులు గోపి, హేమంత్, మధు, చెంచయ్య, వాసు నాయుడు తదితరులు పాల్గొన్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య మొక్కలను నాటారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులు, నాగరాజ, మహేష్, పట్టాభిరెడ్డి, రాధాకృష్ణయ్య, సీఆర్ఎంటీలు మునిమోహన్, ధనశంకరయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రజాప్రగతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కోఆర్డినేటర్ చంద్రశేఖర్, పిల్లలు పాల్గొన్నారు.





శ్రీకాళహస్తిలో, సత్యవేడులో మొక్కలు నాటుతున్న ఎస్సీవీ నాయుడు, జూనియర్ సివిల్ జడ్జి వెంకట నాగరాజు

● సత్యవేడు(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సత్యవేడు జూనియర్ సివిల్ జడ్జి వెంకట నాగరాజు జడ్జి మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్, ఈవోపీఆర్డీ తరుణాక్షరెడ్డి, ఎంపీడీవో కార్యాలయ ఏవో త్రివిక్రమరావు, ఎంఈవో రవి, పీఆర్ ఏఈ ఇబ్రహీంఖాన్, హౌసింగ్ ఏఈ భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ● స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో అటవీశాఖ సిబ్బంది వేణు, దేవరాజు, ఎంఈవో 2 ఉష, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, మాజీ ఎంపీపీ మస్తాన్, నాయకులు పరమశివం, షణ్ముగం, మునిక్రిష్ణయ్య, మోహన్‌బాబు, వెంకటేశ్వర్లు, ధనేష్‌కుమార్, శశిమోహన్, ఎంఎంరవి, అబు సలీమ్ తదితరులు మొక్కలు నాటారు. ● స్థానిక కోర్టు ఆవరణలో జడ్జి వెంకట నాగరాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఏపీపీ లత, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

● ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల బృందం కలిసి మొక్కలు నాటారు. అంజిమేడు ప్రభుత్వ పాఠశాలలో ఏపీసీడ్స్ మాజీ డైరెక్టర్ శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో, ఏర్పేడు సచివాలయం వద్ద ఎంపీడీవో సౌభాగ్యం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో సీఆర్‌వై బెంగళూరు వారి సహకారంతో చింతలపాళెంలో బాలల సంఘాలతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ మంజూష, ఏర్పేడు మండల కోఆర్డినేటర్ శిరీష, సీవోలు వెంకటేష్, మురగయ్య పాల్గొన్నారు.

● బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు ఏకలవ్య గురుకుల పాఠశాల ఆవరణలో ఎంపీడీవో వెంకటరత్నమ్మ, మాజీ ఎంపీపీ రాజాలక్ష్మి మొక్కలు నాటారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ శ్రీదేవి మొక్కలు నాటారు. డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబు నాయుడు, సర్పంచ్ జనార్దన్, మధు నాయుడు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

● నారాయణవనం (ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని బాలికల ఉన్నత పాఠశాల, భీమునిచెరువులో జడ్పీటీసీ సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఎంపీడీవో గుణశేఖర్, తహసీల్దార్ జయరాములు, ఎంఈవో 2 జనార్దన్ రాజు, నారాయణవనం, భీమునిచెరువు సర్పంచులు శారదమ్మ, డి.ఆర్ముగం, కార్యదర్శి సుజనా, ఈవో షణ్ముగం, ఏపీవో సుకన్య, ఏపీఎం మమత, టీడీపీ నాయకులు లక్ష్మణ్ దొర, మహేష్, ముఖేష్, సుధాబాబు పాల్గొన్నారు.

● వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండల కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దారు సుధీర్ మొక్కలు నాటారు. ఉద్యోగులు, సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డివిజనల్ విజిలెన్సు మానటరింగ్‌కమిటీ మెంబర్ గుత్తి త్యాగరాజు, సీనియర్ అసిస్టెంట్ హరి, డిప్యూటీ ఎంపీడీవో చిరంజీవి, ఎంసీవో మంజుభార్గవి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సచివాలయం వద్ద మొక్కలు నాటిన కార్యక్రమంలో సిబ్బంది, కూటమి నాయకులు తడ శ్రీనివాసులు, విజయ్‌కుమార్, మునిభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని భవన నిర్మాణ కార్మికుడి మృతి





సోమయ్య గౌడ్ మృతదేహం, సోమయ్య గౌడ్ (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని తిరుకాల సోమయ్య గౌడ్(45) అనే భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. శ్రీకాళహస్తి మండలం నారాయణపురానికి చెందిన సోమయ్య గౌడ్ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తుంటాడు. బుధవారం రాత్రి ఏర్పేడు మండలం మన్నసముద్రంలో నిర్మాణంపూర్తి చేసిన గృహ ప్రవేశ పూజకు వెళ్లాడు. గురువారం వేకువజామున తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలో శ్రీకాళహస్తి మండలం తొండమనాడు వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వెళుతున్న కొందరు వాహనదారులు గుర్తించి శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. రూరల్ పోలీసులు మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం తిరిగి బంధువులకు అప్పగించిన పోలీసులు హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో కార్మికుడి ఆత్మహత్య



ధనంజయ మృతదేహం

శ్రీకాళహస్తి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ధనంజయ(42) అనే కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీకాళహస్తి పట్టణం ముత్తరాశిపాళెంకు చెందిన ధనంజయ ప్రైవేటు కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఇటీవల కుటుంబంలో కలహాలు తలెత్తాయి. దాంతో మనస్థాపం చెందిన ధనంజయ బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాసేపటి తరువాత గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీసులు ధనంజయ కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు కేసు నమోదు చేశారు. అనంతరం పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే బొజ్జల నివాళి

శ్రీకాళహస్తి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలోని 9వ వార్డు మాజీ కౌన్సిలర్ సుప్రజ భర్త సెంజిగరం వడివేలు ఇటీవల మరణించారు. గురువారం ఆయన స్వగృహంలో కర్మక్రియలు నిర్వహించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. టీడీపీకి వడివేలు చేసిన సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీధి భూమిని ఆక్రమించారని నిరసన

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాలేడు దళితవాడ నుంచి గ్రామానికి పోయే వీధికి సంబంధించిన భూమిని ఆక్రమించారని దళితులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. దళితులు మాట్లాడుతూ దళితవాడ నుంచి గ్రామానికి వెళ్లే వీధికి ఇరువైపులా ఉన్న ఖాళీ భూమిని కొంతమంది ఆక్రమించుకుని వారి పొలంలో కలుపుకున్నారని తెలిపారు. దీంతో అదే భూమిలో ఉన్న పంట కాలువ, బోరు దగ్గరకు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఆక్రమణకు గురైన భూమిని సర్వే చేయాలని తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ సర్వేయరు, వీర్వోల ద్వారా సర్వే చేయిస్తామని దళితులకు హామీ ఇచ్చారు.

పేదలకు అన్నదానం

శ్రీకాళహస్తి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత ఆధ్వర్యంలో గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ప్రతి గురువారం పేదలకు అన్నదానం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పేట చంద్రశేఖర్, జ్యోతిరామ్, పేట చిరంజీవి, గంధం శ్రీను, తేజ, హరి, మణి, లక్ష్మణ్, యాసిన్‌బాషా, మునిచంద్ర, సాయి, మునికుమార్, రాజా, సాయి, వెంకటేష్, చందుయాదవ్, నాగరాజు, వీర మహిళలు కవిత, శారద, గాయత్రి, బత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

వంతెనపై కారును ఢీకొన్న మినీ లారీ

● పెద్ద ఎత్తున స్తంభించిన ట్రాఫిక్



రేణిగుంట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కొత్త చెక్ పోస్ట్ కూడలి సమీపంలోని వంతెనపై కారును మినీ లారీ ఢీకొనడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించిన సంఘటన గురువారం ఉదయం రేణిగుంట, కడప మార్గంలోని వంతెనపై చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే రేణిగుంట నుంచి కడప వైపు వెళ్తున్న కారును వంతెనపై మినీ లారీ వెనక వైపు నుంచి ఢీకొనడంతో గంటసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

శ్రీకాళహస్తీశ్వరుడి సేవలో గవర్నర్ కార్యదర్శి

శ్రీకాళహస్తి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం రాష్ట్ర గవర్నర్ కార్యదర్శి హరి జవహర్‌లాల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈవో బాపిరెడ్డి ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో డీజీపీ కుటుంబసభ్యులు



ఆలయం వద్ద డీజీపీ హరీష్‌గుప్తా కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం రాష్ట్ర డీజీపీ హరీష్‌గుప్తా కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ జీతాలు ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

వరదయ్యపాళెం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలంలోని పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని ఏఐటీయూసీ సత్యవేడు నియోజకవర్గ గౌరవాధ్యక్షులు చిన్నిరాజు అన్నారు. గురువారం మధ్యాహ్న భోజన కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులతో చాకిరి చేయించుకుని జీతభత్యాలు ఇవ్వడంలేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వారికి రూ.26వేలు తక్కువ కాకుండా ఇవ్వాలన్నారు. ఏఐటీయూసీ వారికి అండగా ఉంటుందని తెలిపారు. మునిరాజమ్మ, జ్ఞానమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ

ఏర్పేడు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలోని పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఎంఈవో దయాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు నిర్దేశించిన భోజన మెనూను తప్పనిసరిగా పాటించాలన్నారు. రుచిగా శుచిగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. టాటాట్రస్టుకు చెందిన లక్ష్మీ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మధ్యాహ్న భోజన కార్మికులు పాటించాల్సిన విషయాలను వివరించారు. కార్యక్రమంలో ఏర్పేడు జడ్పీ పాఠశాల హెచ్ఎం మునిలక్ష్మి, సీఆర్పీలు పాల్గొన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు వంటల పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు.

వాగు పోరంబోకు భూమిని శుభ్రం చేస్తుండగా అడ్డుకున్న రెవెన్యూ అధికారులు



వాగు పొరంబోకు భూమిలో ఎక్స్‌కవేటర్‌తో ముళ్ల కంపను శుభ్రం చేస్తున్న దృశ్యం

రేణిగుంట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన ఉన్న వాగు పొరంబోకు భూమిని శుభ్రం చేస్తుండగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్న సంఘటన గురువారం స్థానిక జ్యోతినగర్ వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పాత చెక్ పోస్టు కూడలి నుంచి పాత విమానాశ్రయానికి వెళ్లే మార్గంలో ఉన్న రామకృష్ణ కూడలిలో రోడ్డు పక్కనున్న కరకంబాడి లెక్క దాఖలా సర్వే నెంబర్ 455లో 5 ఎకరాల 14 సెంట్ల వాగు పొరంబోకు భూమిని కొంతమంది ఎక్స్‌కవేటర్లతో శుభ్రం చేస్తుండగా స్థానిక రెవెన్యూ అధికారులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న తహశీల్దార్ సురేష్‌బాబు, సిబ్బంది భూమిని శుభ్రం చేస్తున్న వ్యక్తుల్ని అడ్డుకున్నారు. ఇక మీదట ఈ భూమిలో ప్రవేశిస్తే ఎక్స్‌కవేటర్‌ని సీజ్‌చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించడంతో కబ్జాదారులు అక్కడి నుంచి పలాయనం చిత్తగించారు.